RNI NO.TELTEL/2023/12249

# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in






సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 225 | పేజీలు : 08 | మంగళవారం | 25-08-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.




2

### కొండా సురేఖ అంశం

## క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తుంది

సీఎం రేవంత్



### నేడు పాలిటెక్నిక్

## కాలేజీల బంద్

- తెలంగాణలో నేడు పాలిటెక్నిక్ కాలేజీల బంద్
- జీవో 97ను వ్యతిరేకిస్తూ ఏబీవీపీ ఆందోళన
- నేడు రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ కాలేజీల బంద్‌కు పిలుపు
- జీవోను వెంటనే ఉపసంహరిం చుకోవాలని డిమాండ్

2




### గుజరాత్ నాయకత్వం

# కుట్ర చేస్తుంది

సీఎం రేవంత్ రెడ్డి

- తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని గుజరాత్ నాయకత్వం కుట్ర చేస్తోంది : సీఎం రేవంత్ రెడ్డి
- తన అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంపై కేంద్రంపై మండిపడ్డ రేవంత్
- కేంద్రం తనను అడ్డుకున్నా, తన లక్ష్యాన్ని అడ్డుకోలేరని వ్యాఖ్య
- మోదీ గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారని సీఎం ఆగ్రహం

2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని గుజరాత్ నాయకత్వం కుట్రలు చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. కేంద్రం తనను అడ్డుకున్నా, తన లక్ష్యాన్ని మాత్రం అడ్డుకోలేరని అన్నారు. డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తామన్నారు. తన విదేశీ పర్యటనలో ఎలాంటి గోప్యతా లేదని, మొత్తం షెడ్యూల్‌ను



### సురేఖ చేరికపై

2

# పార్టీదే నిర్ణయం

- బీజేపీలో కొండా సురేఖ చేరికపై పార్టీదే నిర్ణయం: డీకే అరుణ
- కొండా సురేఖ చేరికపై పార్టీదే తుది నిర్ణయమన్న డీకే అరుణ
- పవన్ కుమార్ రెడ్డికి ఎమ్మెల్సీ టికెట్ కోరినట్లు వెల్లడి
- బీజేపీ ఎంపీలంతా కలిసే ఉన్నారని స్పష్టీకరణ
- ఆగస్టు సంక్షోభం కాంగ్రెస్‌కే ఉందంటూ విమర్శ
- రేవంత్ అమెరికా పర్యటనపై కూడా డీకే అరుణ స్పందన

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ భవిష్యత్‌పై చర్చ జరుగుతున్న వేళ, ఆమె బీజేపీలో చేరతారన్న ఊహాగానాలపై ఎంపీ డీకే అరుణ కీలక వ్యాఖ్యలు చేశారు. కొండా సురేఖను పార్టీలోకి తీసుకోవాలా? వద్దా? అనేది బీజేపీ నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు. మీడియాతో

### నాకు తెలుగు

2

## అర్థమవుతుంది

ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

ముసునూరులో పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తనాన్ని ఆవిష్కరించిన రాధాకృష్ణన్

### పాక్ ఆర్మీ చీఫ్‌పై

# మౌలానా ఫైర్..

1971 ఓటమిని గుర్తుచేస్తూ తీవ్ర విమర్శలు

- పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌పై జేయూఐఎఫ్ నేత
- ఫజ్లుర్ రెహ్మన్ ఆగ్రహం 1971 యుద్ధ ఓటమిని ప్రస్తావిస్తూ ప్రస్తుత పరిస్థితులపై హెచ్చరిక
- నిరంతర అణచివేత కొత్త భౌగోళిక సరిహద్దులకు దారితీస్తుందని వ్యాఖ్య
- ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే సైన్యం సంబరాలు చేసుకోవడం సరికాదన్న మౌలానా

2



హైదరాబాద్ పల్స్,డెస్క్

పాకిస్థాన్ సైన్యంపై ఆ దేశంలోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. జమియత్ ఉలేమా-ఎ-ఇస్లాం (జేయూఐ-ఎఫ్) చీఫ్ మౌలానా ఫజ్లుర్ రెహ్మాన్, ప్రస్తుత



## రిజిస్ట్రేషన్ సాధ్యం కాదు

2

- ప్రభుత్వ ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయాలని చూస్తే సాధ్యం కాదు : మంత్రి పొంగులేటి
- 22ఏ జాబితాలోనివి, వివిధ ఆర్డర్లలో ఉన్న వివరాలు అప్‌లోడ్ చేశామన్న మంత్రి పొంగులేటి
- స్లాట్లు బుక్ చేసి రిజిస్ట్రేషన్ కాకపోతే వారంలో ఖాతాలో జమ చేస్తామని వెల్లడి

# రైతులే పారిశ్రామికవేత్తలు కావాలి..

గౌర్మే పాప్‌కార్న్ ఒక విప్లవం: సీఎం చంద్రబాబు

- దేశంలో తొలి నాన్-జీఎంఓ పాప్‌కార్న్ విత్తనాన్ని అభివృద్ధి చేసిన గోర్మే సంస్థ
- సీడ్ ను ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు
- 11 ఏళ్లలో 69% మార్కెట్ వాటాతో గోర్మే అద్భుత విజయం సాధించిందన్న సీఎం
- రైతులను పారిశ్రామికవేత్తలుగా చూడటమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం
- ఫుడ్ ప్రాసెసింగ్‌పై యువత దృష్టి పెట్టాలని చంద్రబాబు పిలుపు
- చింతలపూడి పథకం పూర్తి చేసి నూజివీడు రూపురేఖలు మారుస్తామని హామీ

2




హైదరాబాద్ పల్స్,డెస్క్

వ్యవసాయాన్ని కేవలం జీవనోపాధిగా కాకుండా ఒక ఆర్థిక శక్తిగా చూడాలని, రైతులను పారిశ్రామికవేత్తలుగా మార్చాలన్నదే తమ ప్రభుత్వ విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

# నాపై నిఘా పెట్టారు..

సీఎం సోదరుడిపై ఎంపీ అర్వింద్ సంచలన ఆరోపణలు

- ముఖ్యమంత్రి సోదరుడి ఆదేశాలతో తనపై నిఘా పెట్టారని అర్వింద్ ఆరోపణ
- ఏసీపీ స్థాయి అధికారి తన కదలికలను పర్యవేక్షిస్తున్నారని వెల్లడి
- డీజీపీ సీవీ ఆనంద్‌ను ట్యాగ్ చేస్తూ ఎక్స్‌లో పోస్ట్
- పోలీసులు రాజ్యాంగానికా, సీఎం కుటుంబానికా జవాబుదారీ అని ప్రశ్న

2



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ సోమవారం తెలంగాణ ప్రభుత్వం, పోలీసు యంత్రాంగంపై సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడి ఆదేశాల మేరకు, ఒక ఏసీపీ స్థాయి అధికారి తన కదలికలపై నిఘా ఉంచినట్లు ఆయన ఆరోపించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'

### భారత సంప్రదాయాలను

# అవమానిస్తున్నారు

- 'భారత వారసత్వాన్ని ఎందుకు నాశనం చేయాలనుకుంటున్నారు?'
- రాహుల్‌పై సీఎం యోగి ఫైర్
- రాహుల్ గాంధీపై యోగి ఆదిత్యనాథ్ ఘాటు విమర్శలు
- మనుస్మృతిపై రాహుల్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించిన యూపీ సీఎం
- రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి భారత సంప్రదాయాలను అవమానిస్తున్నారని ఆరోపణ

2



హైదరాబాద్ పల్స్,డెస్క్

కాంగ్రెస్ ఎంపీ,లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంట్‌లో కీలక రాజ్యాంగబద్ధ పవిలో ఉన్న రాహుల్, ప్రజాస్వామ్య వ్యవస్థతో పాటు భారత సంప్రదాయాలు, సంస్కృతి, వారసత్వాన్ని పదేపదే కించపరుస్తున్నారని ఆరోపించారు. మనుస్మృతిపై రాహుల్ ఇటీవల

## నేడు పాలిటెక్నిక్
# కాలేజీల బంద్

మొదటి పేజీరువాయి

తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 97పై అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, నేడుమంగళవారం) రాష్ట్రవ్యాప్త పాలిటెక్నిక్ కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చింది. పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అనుసంధానిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 97ను ఏబీవీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను బలోపేతం చేయాల్సింది పోయి, ఈ నిర్ణయం ద్వారా వాటిని ప్రైవేటీకరించే కుట్ర జరుగుతోందని ఆరోపించింది. ఈ నూతన విధానం వల్ల పాలిటెక్నిక్ విద్యార్థులు బీటెక్‌లో లాటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశం పొందే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ఈ జీవోను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా నేడు చేపట్టనున్న బంద్‌ను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఏబీవీపీ విద్యార్థులకు పిలుపునిచ్చింది.

## సురేఖ చేరికపై
# పార్టీదే నిర్ణయం

మొదటి పేజీరువాయి

చిట్‌చాట్‌లో మాట్లాడిన డీకే అరుణ పలు అంశాలపై స్పందించారు. ఈసారి మహబూబ్‌నగర్ స్థానికులకే ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు. అన్ని ఎన్నికల్లో పనిచేసిన పవన్‌కుమార్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని పార్టీని కోరినట్లు చెప్పారు. బీజేపీ జాతీయ నూతన కమిటీపై స్పందిస్తూ, ఒక బాధ్యత నుంచి తొలగిస్తే అంతకంటే మంచి బాధ్యత ఇస్తారేమోనని వ్యాఖ్యానించారు. బండి సంజయ్ మంత్రి అయిన తర్వాత పార్టీ బాధ్యతలు ఉండవని, తాను ఎంపీ అయిన తర్వాత సమయం లేక కర్ణాటక ఇన్‌ఛార్జి బాధ్యతలను వదిలేశానని తెలిపారు. తెలంగాణ బీజేపీ ఎంపీలందరూ ఐక్యంగానే ఉన్నారని డీకే అరుణ స్పష్టం చేశారు. ఆగస్టు సంక్షోభం కాంగ్రెస్‌కే ఉందని, ఎవరిని గద్దె దించి ఎవరిని నియమిస్తారో చూడాలని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనపై ఆంక్షల అంశంపైనా ఆమె స్పందించారు. రేవంత్‌రెడ్డికి అన్ని విషయాలు తెలుసని, పాస్‌పోర్టుకు కూడా క్లియరెన్స్ అవసరమని పేర్కొన్నారు.

## గుజరాత్ నాయకత్వం
# కుట్ర చేస్తోంది

మొదటి పేజీరువాయి

విదేశాంగశాఖ ముందుంచామన్నారు. లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి, మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేంద్రం, మోదీపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

**4 కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానం**

తెలంగాణ ముఖ్యమంత్రికి విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వకపోవడమనేది 4 కోట్ల ప్రజలకు జరిగిన అవమానమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రిని అడ్డుకోవడం అంటే అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. ప్రధాని మోదీ ఇప్పటికే ఎన్నో దేశాల్లో పర్యటించారని, ఆయన సొంత రాష్ట్ర సీఎం కూడా ఎన్నో దేశాల్లో పర్యటించారన్నారని రేవంత్ రెడ్డి అన్నారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి తమకు ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులకు ఎన్నో సంస్థలు ఆసక్తి చూపించాయని వివరించారు. మన యూనివర్సిటీలతో ఒప్పందానికి విదేశీ వర్సిటీలు ఆసక్తి చూపాయన్నారు. ప్రఖ్యాత వర్సిటీలతో ఎంవోయూలు చేసుకునేందుకే తాను అమెరికా పర్యటన తలపెట్టినట్లుగా వివరించారు. విదేశీ వర్సిటీలు మన వద్దకు వస్తే, మన విద్యార్థులు అక్కడికి వెళ్లాల్సిన అవసరం ఉండదని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

**గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్‌లా వ్యవహరిస్తున్నారు**

ప్రధాని మోదీ గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్ లా వ్యవహరిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. భారత్?కు వచ్చే పెట్టుబడులన్నీ గుజరాత్ రాష్ట్రానికే రావాలని చూస్తున్నారన్నారని ఆరోపించారు. తన పర్యటనను అడ్డుకోవడం గురించి పార్లమెంటులో లేవనెత్తుతామన్నారు. యూకే, యూఎస్ పర్యటనకు ఒకే తరహా వివరాలిచ్చామని రేవంత్ రెడ్డి తెలిపారు. లండన్ పర్యటనకు అనుమతి ఇచ్చి, అమెరికా పర్యటనను మాత్రం ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. రాజకీయ కారణంతోనే అనుమతి ఇవ్వటం లేదని విదేశాంగశాఖ బదులిచ్చిందన్నారు. అసలు రాజకీయ కారణం అంటే ఏమిటి? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తాను తెలంగాణ సీఎం, కాంగ్రెస్ ముఖ్యమంత్రిని కావటమే రాజకీయ కారణమా అని ప్రశ్నించారు.

**కేంద్రాన్ని తప్పుదోవ పట్టించారు**

కేంద్రంలో ఉన్న కొందరు బీజేపీ నేతలు తన అధికార పర్యటనపై అవాస్తవాలు చెప్పి కేంద్రాన్ని తప్పుదోవ పట్టించారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. విదేశీ పర్యటనకు దరఖాస్తు చేసినప్పుడు అన్ని విషయాలు స్పష్టంగా పేర్కొన్నామన్నారు. అమెరికాలో ప్రఖ్యాత వర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని చెప్పామన్నారు. రాజకీయ కారణాల వల్ల అనుమతి నిరాకరిస్తున్నామని విదేశాంగ శాఖ బదులిచ్చిందని తెలిపారు.

## పాక్ ఆర్మీ చీఫ్‌పై
# మౌలానా ఫైర్..

మొదటి పేజీరువాయి

ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్‌పై ఘాటు విమర్శలు గుప్పించారు. 1971 యుద్ధంలో పాకిస్థాన్ ఎదుర్కొన్న పరాభవాన్ని గుర్తుచేస్తూ, సైన్యం తీరును ఆయన తూర్పారబట్టారు. పెషావర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఫజ్లుర్ రెహ్మాన్ మాట్లాడుతూ, దేశంలో నిరంతర అణచివేత, రక్తపాతం కొనసాగితే నూతన భౌగోళిక సరిహద్దులు ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సామాన్య ప్రజలు అష్టకష్టాలు పడుతుంటే, సైన్యం ప్రగల్భాలు పలకడం ఎంతమాత్రం సరికాదని ఆయన మండిపడ్డారు. 1971 యుద్ధానికి ముందు నాటి ఆర్మీ చీఫ్ యాహ్యా ఖాన్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. "మేము శత్రువులతో పర్వతాల్లో, ఎడారుల్లో, వీధుల్లో పోరాడతాం. మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు" అని యాహ్యా ఖాన్ నాడు అన్నారని, కానీ చివరకు పాకిస్థాన్ సైన్యం ఘోర పరాజయాన్ని మూటగట్టుకుందని రెహ్మాన్ ఎద్దేవా చేశారు. భారత్‌తో కేవలం 13 రోజుల పాటు జరిగిన ఆ యుద్ధం ఫలితంగానే బంగ్లాదేశ్ ఆవిర్భవించిందని, 1971 డిసెంబర్ 16న సుమారు 93,000 మంది పాకిస్థాన్ సైనికులు భారత దళాల ఎదుట లొంగిపోయారని ఆయన గుర్తుచేశారు. నాటి పరిస్థితులకు, నేటికీ పెద్దగా వ్యత్యాసం లేదని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే సైన్యం సంబరాలు చేసుకోవడం భావ్యం కాదని ఫజ్లుర్ రెహ్మాన్ అభిప్రాయపడ్డారు.

## భారత సంప్రదాయాలను
# అవమానిస్తున్నారు

మొదటి పేజీరువాయి

మహారాష్ట్రలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, మనువు గురించి తెలుసుకోవాలంటే ప్రాచీన భారతీయ గ్రంథాలను చదవాలని సూచించారు. ఉత్తర్‌ప్రదేశ్ లోని రాయ్?బరేలీలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ, ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.

**ఎమర్జెన్సీపై వ్యాఖ్యలు**

రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటాన్ని కూడా సీఎం యోగి తప్పుపట్టారు. 1975లో కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన ఎమర్జెన్సీని ప్రస్తావిస్తూ, ఆ పార్టీ చరిత్రను గుర్తు చేశారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయాల్సిన బాధ్యత కలిగిన ప్రతిపక్ష నేత వ్యవహరిస్తున్న తీరు అందుకు భిన్నంగా ఉందని విమర్శించారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లినప్పుడు యూపీని, విదేశాలకు వెళ్తే భారత్‌ను కించపరిచేలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఉగ్రవాదంపై రాహుల్ చేసిన వ్యాఖ్యలు పరోక్షంగా దేశ వ్యతిరేక శక్తులకు ప్రోత్సాహం ఇచ్చేలా ఉన్నాయని విమర్శించారు. అయోధ్యలో శ్రీరాముడి ఉనికినే కాంగ్రెస్ ప్రశ్నించిందని ఆరోపిస్తూ, ఆ పార్టీ వైఖరిని తప్పుపట్టారు.

**జంతర్ మంతర్ ఘటనపైనా ప్రస్తావన**

ప్రధాని నరేంద్ర మోదీపై జంతర్ మంతర్ వద్ద ఓ యువతి అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు ప్రచారమైన వివాదాన్ని కూడా సీఎం యోగి ప్రస్తావించారు. అయితే ఆ యువతి, ఆమె తల్లి తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణలు చెప్పారని తెలిపారు. 'రాజకీయ విమర్శలకు కూడా కొన్ని హద్దులు ఉండాలి. అర్బన్ నక్సల్స్ చేతిలో దేశ యువత భవిష్యత్తును ఎందుకు నాశనం చేయాలనుకుంటున్నారు? భారత వారసత్వాన్ని ఎందుకు ధ్వంసం చేయాలనుకుంటున్నారు దేశ భవిష్యత్తును ఎందుకు ప్రమాదంలోకి నెట్టాలనుకుంటున్నారు? ప్రతిపక్ష నేతగా రాహుల్ పార్లమెంట్‌లో నిర్మాణాత్మక పాత్ర పోషించాలని దేశం ఆశించింది. కానీ ఆ అవకాశాన్ని ఆయన వృథా చేసుకున్నారు. అమేఠీ, రాయ్‌బరేలీ ప్రాంతాల ప్రజలు గాంధీ కుటుంబానికి మద్దతు ఇస్తున్నాయి. అయినప్పటికీ ఆ కుటుంబ రాజకీయాల కారణంగా ఆ ప్రాంతం గుర్తింపు సంక్షోభం ఎదుర్కొంటోంది' అని యోగి ఆరోపించారు. ఇటీవల ఛత్రోం కీ గూంజ్ కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, సాంప్రదాయ సమాజంలో మహిళలను కేవలం కూతురు, భార్య లేదా తల్లి అనే మూడు బాక్సులకే పరిమితం చేసే ధోరణి ఉందని విమర్శించారు. ఆ పాత్రల్లో తప్పు లేనప్పటికీ, మహిళల గుర్తింపు కేవలం వాటికే పరిమితం కాకూడదని స్పష్టం చేశారు. . మహిళలు తమ గుర్తింపును తామే చాటుకోవాలని, ఎవరికీ తలవంచకుండా హక్కుల కోసం గళం విప్పాలని పిలుపునిచ్చారు. పితృస్వామ్య భావజాలాన్ని ధైర్యంగా ఎదుర్కొని తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకోవాలన్నారు.

## కొండా సురేఖ అంశం క్రమశిక్షణ
# కమిటీ పరిశీలిస్తుంది
## సీఎం రేవంత్

మొదటి పేజీరువాయి

హైదరాబాద్, ఆగస్టు 24: మంత్రి కొండా సురేఖ అంశం క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తుందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ నిర్ణయాన్ని అందరూ అంగీకరించాల్సిందేనని పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి ప్రెస్ మీట్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా కొండా సురేఖ అంశంపై స్పందించారు. అధిష్ఠానం నిర్ణయానికి ఎవరైనా కట్టుబడి ఉండాల్సిందేనని పేర్కొన్నారు. అంతర్గత వ్యవహారాలపై మాట్లాడనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అలాగే ఊహాజనిత కథనాలపై స్పందించనని సీఎం రేవంత్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. ఈ సమావేశంలో తన అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంపై ఆయన ఘాటుగా స్పందించారు. దురుద్దేశపూర్వకంగానే తన అమెరికా పర్యటనను కేంద్రం తిరస్కరించిందని తెలిపారు. మరో వైపు మంత్రి కొండా సురేఖ జన్మదినం సందర్భంగా గీసుకొండలో ఆమె అభిమానులు వేడుకలు నిర్వహించారు. దీనికి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి. దీనిపై క్రమశిక్షణ కమిటీ కూడా స్పందించింది. దాంతో ఆ కమిటీకి కొండా సురేఖ వరుసగా రెండు లేఖలు రాశారు. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారం క్రమశిక్షణ కమిటీ చూస్తుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# రైతులే పారిశ్రామికవేత్తలు కావాలి..

మొదటి పేజీరువాయి

దేశంలోనే మొట్టమొదటి నాన్-జీఎంఓ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తనాన్ని అభివృద్ధి చేసిన 'గార్మే పాప్‌కార్న్‌కా' సంస్థ ఒక వినూత్న విప్లవానికి శ్రీకారం చుట్టిందని ఆయన కొనియాడారు. ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌తో కలిసి నూజివీడు సమీపంలోని ముసునూరులో జరిగిన గార్మే సంస్థ కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు, కొత్తరకం పాప్ కార్న్ సీడ్ ను ఆవిష్కరించారు. సంస్థ విజయగాథను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళతామని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ఒకప్పుడు మన దేశంలో అమ్ముడైన ప్రతి పాప్‌కార్న్ గింజపై మనం ఖర్చు చేసిన డబ్బులో 70 శాతానికి పైగా బ్రెజిల్, అర్జెంటీనా వంటి దేశాలకు వెళ్లేది. కానీ, గార్మే సంస్థ కృషితో ఇప్పుడు ఆ 70 శాతం ఆదాయం మన దేశ రైతులకే దక్కుతోంది. కేవలం 11 ఏళ్లలో ఈ సంస్థ దేశానికి 125 మిలియన్ అమెరికన్ డాలర్ల (దాదాపు రూ.1000 కోట్లకు పైగా) విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసింది. ఇది మనందరికీ గర్వకారణం" అని ప్రశంసించారు. గార్మే సంస్థ చూపిన 'అవుట్ ఆఫ్ బాక్స్' ఆలోచనా విధానం రాష్ట్రంలోని యువతకు స్ఫూర్తిదాయకమని, ఇలాంటి వినూత్న స్టార్టప్‌లకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్ సాధ్యం కాదు

మొదటి పేజీరువాయి

22ఏ భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్లు ఆగిన వాటిని 24 గంటల్లో క్లియర్ చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయాలని చూస్తే సాధ్యం కాదన్నారు. మేడ్చల్?లోని భూధాన్? భూముల్లో వాటిని తిరస్కరించామని వెల్లడించారు. స్లాట్లు బుక్? చేసి రిజిస్ట్రేషన్ కాకపోతే వారంలో ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ఈనెల 18 నుంచి టోల్?ఫ్రీ నంబర్?కు 1162 కాల్స్ వచ్చాయని, వాటిని జిల్లాల వారిగా పంపించినట్లుగా పొంగులేటి తెలిపారు. ప్రైవేటు ఆస్తులవి కాకుండా ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన సమస్యలే ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ అశంపై ప్రతి సోమవారం ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్నామన్నారు. 22ఏ జాబితాలోనివి, వివిధ ఆర్డర్లలోని ఉన్న వివరాలు అప్?లోడ్ చేశామని పొంగులేటి తెలిపారు. ప్రభుత్వ ఆస్తులు రిజిస్ట్రేషన్ సాధ్యం కాదు : ప్రభుత్వ ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయాలని చూస్తే సాధ్యం కాదని వివరించారు. మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో సీఎస్?7,14కు సంబంధించిన వివాదాలు ఉన్నాయని, భూములకు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తుల మధ్య వివాదం ఉందన్నారు. సీఎస్? 7, 14కు సంబంధించి గతంలో రేవంత్ రెడ్డి పోరాడారని పొంగులేటి గుర్తుచేశారు. 22ఏకి సంబంధించి రిజిస్ట్రేషన్లు ఆగిన వాటిలో 24 గంటల్లో క్లియర్ చేశామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఎక్కడైనా ఒకటి రెండు ఆగిపోతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అధికారుల సంతకాలు పోర్జరీ చేసి రిజిస్ట్రేషన్లు చేయాలని లేఖలు రాస్తున్నారన్నారు. నిందితులను గుర్తించి కేసులు నమోదు చేయాలని ఆదేశించామని ఆయన వెల్లడించారు.

# నాపై నిఘా పెట్టారు..

మొదటి పేజీరువాయి

వేదికగా తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ను ఉద్దేశించి ఆయన ఒక పోస్ట్ చేశారు. "డీజీపీ సీవీ ఆనంద్ గారూ, మీరు నాకు దశాబ్దాలుగా తెలుసు. మిమ్మల్ని ఎప్పుడూ ఒక సమర్థవంతమైన అధికారిగానే పరిగణించాను. అయితే, ముఖ్యమంత్రి సోదరుడి ఆదేశాల మేరకు ఒక ఏసీపీ స్థాయి అధికారికి నా కదలికలను పర్యవేక్షించే బాధ్యతను అప్పగించినట్లు నా దృష్టికి వచ్చింది" అని అర్వింద్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన పోలీసుల పనితీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "తెలంగాణ పోలీసులు రాజ్యాంగానికి, చట్టబద్ధమైన అధికార యంత్రాంగానికి లోబడి పనిచేస్తారా? లేక ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల ఆదేశాల మేరకు నడుచుకుంటారా? అనేది ఇక్కడ ఉత్పన్నమవుతున్న ప్రాథమిక ప్రశ్న" అని ఆయన నిలదీశారు. పోలీసులు కేవలం చట్టానికి మాత్రమే జవాబుదారీగా ఉండాలని, ఏ రాజకీయ కుటుంబానికీ కాదని తాను ఆశిస్తున్నట్లు అర్వింద్ స్పష్టం చేశారు.

## నాకు తెలుగు
# అర్థమవుతుంది

మొదటి పేజీరువాయి



ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గ పరిధిలోని ముసునూరులో నాన్-జీఎంఓ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తనాన్ని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ సీఎం చంద్రబాబుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించి సభలోని వారిని అలరించారు. తనకు తెలుగు అర్థమవుతుందని.. కానీ స్పష్టంగా మాట్లాడలేనని చెప్పారు. మన దేశంలో జనవరి 14న సంక్రాంతి పంటల పండుగను విభిన్న పేర్లతో కలిసికట్టుగా జరుపుకుంటామని పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణల్లో సంక్రాంతిగా, తమిళనాడులో పొంగల్‌గా, పంజాబ్‌లో లోహ్రీగా, అసోంలో బిహూగా పిలుచుకుంటామని గుర్తుచేశారు. దేశంలో 8 రాష్ట్రాల్లో 17,500 మంది రైతులు దాదాపు 40 వేల ఎకరాల్లో పాప్‌కార్న్ మొక్కజొన్నను పండించడం అభినందనీయమన్నారు. అమెరికా నుంచి పాప్‌కార్న్ దిగుమతి చేసుకోవడం మానేసి, మనమే అక్కడికి ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. రైతుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని చెప్పారు. డ్రోన్లను రైతులకు అద్దెకు ఇచ్చే పథకం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.1,200 కోట్లను మహిళా సంఘాలకు కేటాయించిందని వివరించారు. మహానది నుంచి కావేరి నది వరకు నదుల అనుసంధానం కేవలం కలగానే మిగిలిపోదని, కొంత సమయం పట్టినా భవిష్యత్తులో తప్పకుండా వాస్తవ రూపం దాలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఒంటరి మహిళల సర్టిఫికెట్లకు తిప్పలు

**ఆలేరు రెవెన్యూ కార్యాలయంలో తీవ్ర జాప్యం**
**ఒంటరి మహిళలు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోని అధికారులు**
**ఎంఏ ఇక్బాల్ సిపిఎం జిల్లా నాయకుల**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 24, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ప్రభుత్వం ఇస్తున్న చేయూత పెన్షన్లలో భర్తల అనాధరణకు గురైన ఒంటరి మహిళలకు చేయూత అందించాలని ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ వారిని గుర్తించి సర్టిఫికెట్లు మంజూరు చేయాలని ఎమ్మార్వో కి ప్రభుత్వం అప్పజెప్పినప్పటికీ వారికి ఎంక్వయిరీ చేసి సర్టిఫికెట్లు అందించడంలో ఆలేరు రెవెన్యూ కార్యాలయంలో తీవ్ర జాప్యం జరుగుతుందనీ సిపిఎం జిల్లా నాయకులు ఎంఏ ఇక్బాల్ అన్నారు. సోమవారం రోజు మీడియాతో మాట్లాడుతూ... 15 రోజులుగా కార్యాలయం చుట్టూ తిరిగి తాము రోజు సంపాదించుకునే కూలి కూడ నష్టపోతున్నామని ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఒంటరి మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. వీరి సమస్యను పరిష్కరించి సర్టిఫికెట్లు అందించడంలో రెవెన్యూ అధికారుల స్పందన కరువైందని అన్నారు.
ఆగస్టు 31వ తేదీ చివరి గడువు ఉండటంతో సర్టిఫికెట్ల కోసం గత తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించడం లేదని అధికారులు నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వం ఒంటరి మహిళలకు ఇవ్వదలచిన చేయూత పెన్షన్ ఏ ఒక్క ఒంటరి పెన్షన్ ఒంటరి మహిళకు రాకపోయినా దానికి బాధ్యులు ఆలేరు తహసిల్దార్ అధికారులని ఈ సందర్భంగా ఆయన అన్నారు చివరి తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిశీలించి అర్హులైన ఒంటరి మహిళలకు సర్టిఫికెట్లు జారీ చేయాలని డిమాండ్ చేశారు. మహిళలు రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని, ఆగస్టు 31 గడువులోగా సర్టిఫికెట్లు అందేలా చర్యలు చేపట్టాలని అన్నారు



# ఆర్మీని శాసించబోతున్న షేర్ గన్, నిమిషానికి 700 రౌండ్ల ఫైరింగ్

**స్వదేశీ 'ఏకే-203 షేర్' విజయవంతమైన పరీక్ష**
**సెప్టెంబరులో సైనిక పరీక్షలు.. 2032 నాటికి 6 లక్షల రైఫిళ్ల తయారీ లక్ష్యం**

**హైదరాబాద్ పల్స్ న్యూస్,**
**న్యూఢిల్లీ, ఆగస్టు 24:**
భారత రక్షణ రంగంలో స్వదేశీ తయారీకి మరో ముందడుగు పడింది. ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ కోర్వా ఆయుధ కర్మాగారంలో దేశీయంగా తయారు చేసిన 'ఏకే–203 షేర్' రైఫిల్‌కు నిర్వహించిన తొలి పరీక్షలు విజయవంతమైనట్లు సమాచారం.ఇండో–రష్యన్ రైఫిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూపొందుతున్న ఈ రైఫిల్‌లో ప్రస్తుతం అన్ని కీలక భాగాలను దేశీయంగానే తయారు చేస్తున్నట్లు సంస్థ తెలిపింది. వివిధ రకాల




పరీక్షల్లో రైఫిల్ సమర్థంగా పనిచేసినట్లు పేర్కొన్నారు.

**సెప్టెంబరులో సైనిక పరీక్షలు**

తదుపరి దశలో సైనిక పరీక్షల కోసం నమూనాలను సిద్ధం చేస్తున్నారు. సెప్టెంబర్‌లో భారత సైన్యానికి పరీక్షల నిమిత్తం రైఫిళ్లను అందించనున్నట్లు సమాచారం. సైన్యం నుంచి అనుమతి లభించిన అనంతరం భారీ స్థాయిలో ఉత్పత్తి చేపట్టే అవకాశం ఉంది.2032 నాటికి సుమారు 6 లక్షలకు పైగా రైఫిళ్లను భారత సైన్యానికి అందించాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించినట్లు సమాచారం. ఇప్పటికే సైన్యంలో వినియోగిస్తున్న ఇన్సాస్ రైఫిళ్లకు ప్రత్యామ్నాయంగా ఈ కొత్త రైఫిళ్లను ప్రవేశపెట్టే అవకాశం ఉంది.స్వదేశీ పరిజ్ఞానం, దేశీయ పరిశ్రమల భాగస్వామ్యంతో రక్షణ పరికరాల తయారీని మరింత పెంచడంలో ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుందని రక్షణ రంగ నిపుణులు పేర్కొంటున్నారు.

# కోహీర్‌లో న్యాయ సేవా కేంద్రం ప్రారంభం

**ఎం.ఎఫ్. డాక్యుమెంట్ రైటర్స్ అండ్ లీగల్ సర్వీసు సెంటర్ ప్రారంభోత్సవంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు సిద్ధం ఉజ్వల్ రెడ్డి**

**హైదరాబాద్ పల్స్ న్యూస్,**
**కోహీర్, ఆగస్టు 24:**
కోహీర్ మున్సిపల్ కేంద్రంలో ఎం.ఎఫ్. డాక్యుమెంట్ రైటర్స్ అండ్ లీగల్ సర్వీసు సెంటర్‌ను సోమవారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు సిద్ధం ఉజ్వల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రం నిర్వాహకుడు ముజామిల్ ఆయనను సన్మానించారు.ఈ సందర్భంగా సిద్ధం ఉజ్వల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన పత్రాల తయారీతో పాటు న్యాయపరమైన సేవలను ఒకే చోట అందించేందుకు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలకు సులభంగా,



పారదర్శకంగా సేవలు అందిస్తూ వారి సమస్యల పరిష్కారానికి కేంద్రం దోహదపడాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ రాంలింగారెడ్డి, మున్సిపల్ చైర్మన్ అశోక్, సీడీసీ చైర్మన్ ముబీన్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు పి. నాగిరెడ్డి, కోహీర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ముజాఫర్, జహీరాబాద్, కోహీర్ మండలాల అధ్యక్షులు నర్సింహారెడ్డి, మల్లన్న పాటిల్, మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ హన్నన్ జావేద్, మాజీ ఎంపీపీ షౌకత్ అలీ, మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు షంషీర్ అలీతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, స్థానిక ప్రజలు, డాక్యుమెంట్ రైటర్లు, న్యాయ సేవల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై కొరడా..
# 75 గజాల్లో 7 మీటర్లకు మించితే కూల్చివేత

**అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలపై ప్రత్యేక తనిఖీలు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 24, తెలంగాణ బ్యూరో:**
గచ్చిబౌలిలో 50 గజాల స్థలంలో నిర్మించిన ఏడంతస్తుల భవనం కూలిన ఘటన నేపథ్యంలో సైబరాబాద్ మున్సిపల్ అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలను ముమ్మరం చేశారు. 75 గజాల స్థలంలో 7 మీటర్లకు మించి నిర్మించిన భవనాలను గుర్తించి నిబంధనల ప్రకారం కూల్చివేత చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ సృజన అధికారులను ఆదేశించారు.అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలతో పాటు మంజూరైన ప్రణాళికకు విరుద్ధంగా నిర్మించిన అదనపు అంతస్తులు, ఇతర అక్రమ నిర్మాణాలపై తనిఖీలు చేపట్టనున్నారు. భవనాలకు అనుమతులు ఉన్నాయా, మంజూరైన ప్రణాళిక ప్రకారమే నిర్మాణం జరిగిందా, నిర్దేశిత ఎత్తు నిబంధనలు పాటించారా అనే అంశాలను పరిశీలించనున్నారు.అక్రమ నిర్మాణాలకు అధికారులు లేదా సిబ్బంది సహకరించినట్లు, నిర్మాణదారుల నుంచి డబ్బులు తీసుకున్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. డబ్బులు తీసుకున్నట్లు రుజువైతే సస్పెన్షన్ తప్పదని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలని





అధికారులను ఆదేశించారు.తక్కువ విస్తీర్ణం ఉన్న స్థలాల్లో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టడం ప్రమాదకరమని అధికారులు పేర్కొన్నారు. గచ్చిబౌలి ఘటన నేపథ్యంలో సైబరాబాద్ మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై తనిఖీలు మరింత విస్తృతం చేయనున్నట్లు తెలిపారు.

# మల్లారెడ్డి స్ఫూర్తితో రైతులు ఉద్యమాలు చేయాలి

**సారంపల్లి మల్లారెడ్డికి సీపీఎం ఆధ్వర్యంలో నివాళి**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 24, నారాయణఖేడ్:**
సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు, రైతు సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి చిత్రపటానికి నారాయణఖేడ్‌లో సీపీఎం ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సీపీఎం నారాయణఖేడ్ కార్యదర్శి రమేష్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొౌరి నర్సింలు మాట్లాడుతూ మల్లారెడ్డి మృతి పార్టీకి, రైతు ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. రైతుల హక్కులు, వ్యవసాయ రంగ సమస్యల పరిష్కారం కోసం ఆయన అనేక ఉద్యమాలు నిర్వహించారని గుర్తుచేశారు.రైతుల భూమి హక్కులు, సాగునీరు, వ్యవసాయ రుణాలు, విత్తనాలు తదితర సమస్యలపై నిరంతరం పోరాడుతూ తన జీవితాన్ని రైతుల సంక్షేమానికి అంకితం చేశారని తెలిపారు. మల్లారెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ రైతుల సమస్యలపై ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మైపాల్, రాంలాల్, కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# రాతి నేలను సాగుభూమిగా మార్చే యంత్రం ఆవిష్కరణ

**దీపక్ రెడ్డిని అభినందించిన డిప్యూటీ కలెక్టర్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 24 –నారాయణఖేడ్:**
బీడుగా ఉన్న రాతి నేలను సాగుభూమిగా మార్చేందుకు ఉపయోగపడే యంత్రాన్ని ఆవిష్కరించిన మనూర్ మండలం బోరంచ గ్రామానికి చెందిన దీపక్ రెడ్డిని డిప్యూటీ కలెక్టర్ ప్రతిభ శేఖర్ అభినందించారు.సోమవారం మనూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో దీపక్ రెడ్డిని సత్కరించి శాలువా కప్పారు. ఈ సందర్భంగా ప్రతిభ శేఖర్ మాట్లాడుతూ వ్యవసాయ పొలాల గట్లలోని రాళ్ల కారణంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి వాటిని తొలగించే యంత్రాన్ని తయారు చేయడం అభినందనీయమన్నారు. రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని నూతన ఆలోచనతో యంత్రాన్ని రూపొందించడం గొప్ప విషయమని పేర్కొన్నారు.కార్యక్రమంలో తహసీల్దార్ విష్ణు సాగర్, డిప్యూటీ తహసీల్దార్ ఆదర్శ్ కుమార్, ఆర్ఐ శంకర్ రెడ్డి, ఖాజామోనుద్దీన్, బోజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ

**ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాత విచారణ చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలి**



**సంగారెడ్డి, ఆగస్టు 24 (హైదరాబాద్ పల్స్):**
ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా తెలుసుకున్నారు.పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారంలో జాప్యానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమస్యకు పరిష్కారం లభించని పక్షంలో ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని ఎస్పీ తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని చట్టపరమైన పరిష్కారం అందించడమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎస్పీ పేర్కొన్నారు.

# దూలపల్లి మహాలక్ష్మి వెంచర్‌లో ఐదు అంతస్తుల నిర్మాణం

**అనుమతులు లేకుండానే భవన నిర్మాణం జరుగుతోందా?**

**అధికారుల తీరుపై స్థానికుల అనుమానాలు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్,**
**ఆగస్టు 24, దూలపల్లి:**
దూలపల్లిలోని మహాలక్ష్మి వెంచర్‌లో భవన నిర్మాణ అనుమతులు లేకుండానే ఐదు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతోందనే ఆరోపణలు వస్తున్నప్పటికీ సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**భవన నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా?**
సమర్పించిన నిర్మాణ ప్రణాళిక ప్రకారం ఎన్ని అంతస్తులకు అనుమతి ఉంది? సెట్‌బ్యాక్‌లు, ఇతర నిర్మాణ నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంది. అయితే నిర్మాణం ఐదు అంతస్తులకు చేరుకున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

**అధికారుల మౌనంపై అనుమానాలు:**
అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్మాణానికి సంబంధించి అధికారులకు ఫిర్యాదులు అందాయా? అనుమతులు ఉంటే ఎన్ని అంతస్తులకు మంజూరు చేశారు? అనే వివరాలను అధికారులు బహిర్గతం చేయాలని కోరుతున్నారుఅధికారులు స్పందించకపోవడానికి ముడుపుల వ్యవహారం ఏమైనా కారణమా? అనే ఆరోపణలు కూడా స్థానికంగా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఎలాంటి అధికారిక నిర్ధారణ లేదు. సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.మహాలక్ష్మి వెంచర్‌లో జరుగుతున్న నిర్మాణంపై ఉన్నతాధికారులు తక్షణమే క్షేత్రస్థాయి విచారణ చేపట్టి, భవనానికి అనుమతులు ఉన్నాయా? నిర్మాణం నిబంధనలకు అనుగుణంగా జరుగుతోందా? అనే అంశాలను తేల్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలి

**జిల్లా పోలీస్ అసోసియేషన్ సభ్యులకు ఎస్పీ పరితోష్ పంకజ్ సూచన**

**సంగారెడ్డి, ఆగస్టు 24, హైదరాబాద్ పల్స్ న్యూస్:** నూతనంగా ఎన్నికైన సంగారెడ్డి జిల్లా పోలీస్ అసోసియేషన్ సభ్యులు సోమవారం జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సంక్షేమం, వారి సమస్యల పరిష్కారంలో పోలీస్ అసోసియేషన్ కీలక పాత్ర పోషించాలని సూచించారు. సిబ్బందికి సంబంధించిన వేతన ప్యాకేజీ, ఆరోగ్య భద్రత, సంక్షేమ అంశాలపై నిరంతరం దృష్టి సారించి అవసరమైన సహాయ సహకారాలు అందేలా కృషి చేయాలని తెలిపారు.పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సిబ్బంది సంక్షేమం, వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీస్ శాఖ తరపున అవసరమైన సహకారం అందిస్తామని ఎస్పీ తెలిపారు.అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. సిబ్బంది సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని, పోలీస్ ఉన్నతాధికారుల సూచనల మేరకు సమన్వయంతో పనిచేస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు



ఎ. జనార్ధన్, ఉపాధ్యక్షుడు బి. రమేష్, రాజశేఖర్ రెడ్డి, ఆర్ఐ ఎం. రాజారామ్, జి. సంతోష్ కుమార్, కూన రమేష్, అబ్దుల్ కరీమ్, టి. వెంకటేశం, జి. శ్రీనివాస్, పి. అరుణ కుమారి, అంగోత్ రమేష్, ముజామిల్ తదితరులు పాల్గొన్నారు.

# కశ్విక చికిత్సకు చేయూత..
# కష్టాల్లో ఉన్న కుటుంబానికి దాతల భరోసా

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 24, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :**
ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామానికి చెందిన చిన్నారి కశ్విక వైద్య చికిత్సకు మానవతా హృదయంతో పలువురు అండగా నిలుస్తున్నారు. అరుదైన అనారోగ్యంతో బాధపడుతున్న కశ్వికకు మెరుగైన వైద్యం అందించేందుకు కుటుంబ సభ్యులు చేస్తున్న ప్రయత్నాలకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారుతున్నాయి.ఈ విషయం తెలుసుకున్న మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామానికి చెందిన పాస్టర్ షాలోమ్ శ్రీనివాస్, మెకానిక్ కొండపల్లి రాంబాబు, స్పందించి చిన్నారి తండ్రి



కంపాటి రవీందర్‌ను కలిసి తమ వంతు ఆర్థిక సహాయాన్ని అందించారు. కష్టకాలంలో ఉన్న కుటుంబానికి తమకు చేతనైన సాయం చేయడం ద్వారా మానవత్వాన్ని చాటుకున్నారు.చిన్నారి చికిత్స ఇప్పటికే కుటుంబంపై భారీ ఆర్థిక భారాన్ని మోపింది. వైద్యం నిరంతరంగా కొనసాగించాల్సి ఉండటంతో మరింత ఆర్థిక సహాయం అవసరమవుతోంది. చిన్నారి పరిస్థితిని తెలుసుకున్న దాతలు ముందుకు వచ్చి అండగా నిలవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.ఆపదలో ఉన్న కుటుంబానికి సాయం చేసిన పాస్టర్ షాలోమ్ శ్రీనివాస్, కొండపల్లి రాంబాబును స్థానికులు అభినందించారు. తమ కష్టాన్ని అర్థం చేసుకుని సహాయం అందించినందుకు చిన్నారి తండ్రి కంపాటి రవీందర్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కంటోన్మెంట్ అభివృద్ధి పనులకు రూ.9 కోట్ల టెండర్ల ఆమోదం

**త్వరలో వివిధ వార్డుల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ, పార్కుల పనులు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్,**
**సికింద్రాబాద్, ఆగస్టు 24:**
సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సాధారణ సమావేశంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్లను ఆమోదించారు. దీంతో కంటోన్మెంట్ పరిధిలోని వివిధ వార్డుల్లో త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయి..ఈ సందర్భంగా కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదా మల్లికార్జున్ మాట్లాడుతూ కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేయకపోవడంతో గతంలో అభివృద్ధి పనుల్లో కొంత జాప్యం ఏర్పడిందన్నారు. ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, మొత్తం రూ.9 కోట్ల విలువైన పనులను త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు.సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.3 కోట్లు, భూగర్భ డ్రైనేజీకి రూ.3 కోట్లు, పార్కుల అభివృద్ధి, ట్రాఫిక్ కూడళ్లు, ఫుట్‌పాత్‌లు, డివైడర్ల నిర్మాణానికి మరో రూ.3 కోట్లు ప్రతిపాదించినట్లు వెల్లడించారు.







ఈ పనులను రెండు వారాల్లో వివిధ వార్డుల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఎలివేటెడ్ కారిడార్ కోసం కంటోన్మెంట్ భూములను బదలాయించినందుకు గతంలో అందిన రూ.303 కోట్ల పరిహారానికి అదనంగా మరో రూ.35 కోట్లు అందనున్నాయని తెలిపారు. హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కంటోన్మెంట్ బోర్డుకు మరో రూ.20 కోట్ల నిధులు రానున్నాయని, వాటిని మౌలిక వసతుల అభివృద్ధికి వినియోగిస్తామని తెలిపారు.

**కమ్యూనిటీ హాళ్ల పూర్తికి చర్యలు**
కంటోన్మెంట్ పరిధిలో నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన సుమారు 15 నుంచి 20 కమ్యూనిటీ హాళ్లను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ను కోరుతున్నట్లు నర్మదా మల్లికార్జున్ తెలిపారు. అవసరమైన నిధులు కేటాయించి పెండింగ్ నిర్మాణాలను పూర్తి చేస్తే బస్తీలు, కాలనీల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అవసరమున్న ప్రాంతాల్లో కొత్త కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి కూడా చర్యలు చేపట్టాలని కోరారు.కంటోన్మెంట్ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

# జిన్నారం పోచమ్మ ఆలయానికి రూ.12 లక్షల విరాళం

**ఆలయ నిర్మాణానికి సొంత నిధులతో సహకారం అందించిన ఎమ్మెల్యే జీఎంఆర్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్,**
**ఆగస్టు 24, జిన్నారం:**
జిన్నారం మున్సిపల్ కేంద్రంలో మాల సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి ఆలయానికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి రూ.12 లక్షల విరాళం అందించారు. సోమవారం స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, గ్రామ ప్రజలతో కలిసి ఆలయ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఆలయ కమిటీ సభ్యులకు నగదును అందజేశారు.ఈ నెల 30న నిర్వహించనున్న ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవభక్తి, ఆధ్యాత్మికతతో పాటు ప్రజాసేవను బాధ్యతగా భావిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలతో పాటు ప్రజలను ఐక్యం చేసే సామాజిక వేదికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు.నియోజకవర్గ వ్యాప్తంగా సొంత నిధులతో 200కు పైగా దేవాలయాలు, మసీదులు, ఆశూర్‌ఖానాలు, చర్చిల నిర్మాణానికి సహకరించినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు వెంకటేష్ గౌడ్, బాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# స్వదేశానికి వచ్చి.. గోదానం చేసి..!

**అమెరికా నుంచి వచ్చి ఆధ్యాత్మిక సేవలు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 24, జహీరాబాద్:**
శ్రావణమాసం సందర్భంగా అమెరికా నుంచి స్వదేశానికి వచ్చిన సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం మాచునూర్ గ్రామానికి చెందిన కొంక వైజయంతిమాల, రమేష్ దంపతులు సోమవారం బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గోదానం చేయడంతో పాటు వేద విద్యార్థులకు అన్నదానం, భక్తులకు వస్త్రదానం నిర్వహించారు.ఆశ్రమ పీఠాధిపతులు అవధూత గిరి మహారాజ్, సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ దంపతులను అభినందించి పూలమాలలతో సన్మానించారు. అమెరికాలోని మేరీల్యాండ్‌లో కొన్నేళ్లుగా స్థిరపడిన వారు శ్రావణమాసం సందర్భంగా స్వదేశానికి వచ్చి ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పీఠాధిపతులు పేర్కొన్నారు.శ్రావణ సోమవారం సందర్భంగా ఆశ్రమంలో జ్యోతిర్లింగాలకు బిల్వార్చన, రుద్రాభిషేకం, ప్రత్యేక అలంకరణ, మహామంగళహారతులు నిర్వహించారు. రాత్రి బసవ పురాణ ప్రవచనం, భజన సంకీర్తన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి.

# గాయత్రి జ్ఞాన మందిరంలో లక్ష పుష్పార్చన పూజ కార్యక్రమం

**హోమ, అభిషేక,లక్ష పుష్పాలతో స్వామి వారికీ ప్రత్యేక పూజలు.**





**ఆగష్టు 24, స్వర్ణదామా నగర్ (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
సికింద్రాబాద్ పరిధిలోని ఓల్డ్ బోయినపల్లి 262 డివిజన్ లోని స్వర్ణ దామా నగర్ లోని గాయత్రీ జ్ఞాన మందిరంలో శ్రావణ మాసం సందర్భంగా ప్రతి సోమవారం విశేష పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మొదటి సోమవారం లక్ష బిల్వార్చన పూజ ,రెండవ సోమవారం సిద్ధి మహా కాళేశ్వర్ స్వామి వారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో లక్ష పుష్పాలతో లక్ష పూల పూజ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం వేళ ఈ సందర్భంగా ఆలయ కమిటీ,పూజారులు హైదరాబాద్ పల్స్ ప్రతినిధితో మాట్లాడుతూ.. మహిమన్వితమైన శ్రీ సిద్ధి మహా కాళేశ్వర్ స్వామి వారి అనుగ్రహం కరుణ కటాక్షాలు కలగాలని ప్రజలందరు, భక్తులందరు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో, ఐశ్వర్యం, శాంతి కలగాలని కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో గాయత్రి జ్ఞాన మందిరం పూజారులు రాజేశ్వర్, శైలేంద్ర, మధుసూదన్ రెడ్డి, జంజీరాల సురేష్, లింగం, సుజిత్ రెడ్డి, శ్రీధర్, మహేష్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించిన చైర్మన్ తంగాళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్

**భువనగిరి మున్సిపాలిటీ 11, 25 వ వార్డుల్లో డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టిన చైర్మన్ తంగాళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 24, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు మరియు 25వ వార్డుల్లో డ్రైనేజీ మోరీ (మురుగు కాల్వ) నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ తంగాళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ తంగాళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ మాట్లాడుతూ... భువనగిరి పట్టణ అభివృద్ధే ధ్యేయంగా మున్సిపల్ పాలకవర్గం పనిచేస్తోందని, గతంలో వర్షాకాలంలో 11, 25 వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో ప్రత్యేక నిధులు మంజూరు చేయించి ఈ పనులు చేపట్టామని తెలిపారు. పనులను నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు బెండే స్వరూప లాల్ రాజ్, నూతన డిఇ గంజి శ్రీవాణి రెడ్డి, ఏఇ రంజిత్, భువనగిరి వెంకట్ రమణ, పిట్టల బాలరాజు, బెండే శ్రీకాంత్, సిలివేరు ఉపేందర్, నాకోటి రాము, బెండే కృష్ణ, దాత్రక్ రాజేష్, బానుక పండు, కొలుపుల కృష్ణ, కూర శివకుమార్, గంజి గణేష్ రెడ్డి మరియు మునిసిపల్ సిబ్బంది కాలనీవాసులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# సంగమేశ్వర స్వామివారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య





**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 24, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి: జహీరాబాద్,** ఝురాసంగంలోని ప్రసిద్ధ శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామివారి ఆలయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అభిషేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందించారు. సంగమేశ్వర స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా అభివృద్ధి చెందాలని బీర్ల ఐలయ్య ఆకాంక్షించారు. ఝురాసంగం కేతకీ సంగమేశ్వర క్షేత్రం "దక్షిణ కాశీ"గా ప్రసిద్ధి చెందిందని, ఈ పవిత్ర పుణ్యక్షేత్రాన్ని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సిఎం రేవంత్ రెడ్డికి స్వాగత శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 24, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన విజయవంతంగా ముగించుకుని తిరిగి హైదరాబాద్ కు విచ్చేసిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మంత్రులు, ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీ లతో కలసి స్వాగత శుభాకాంక్షలు తెలిపారు.

# ఆలేరు తహశీల్దార్ కార్యాలయంలో ఏసీబీకి దాడులు

**రూ.14 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ ఆర్ఐ, జిపిఓ**

**భూ రిజిస్ట్రేషన్‌కు నివేదిక ఇవ్వాలంటూ లంచం డిమాండ్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 24, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు తహశీల్దార్ కార్యాలయంలో రూ. 14 వేల లంచం తీసుకుంటూ అలేరు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, కొలనుపాక గ్రామ పాలనాధికారి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. తెలంగాణ అవినీతి నిరోధక శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. అలేరు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెముగంటి పూర్ణచందర్‌రావు, కొలనుపాక గ్రామ పాలనాధికారి షేక్ అహ్మద్ ఈ వ్యవహారంలో నిందితులుగా ఉన్నారు. ఫిర్యాదుదారుడి సోదరి విక్రయించిన భూమి రిజిస్ట్రేషన్‌కు సంబంధించి తహసీల్దార్‌కు నివేదిక ఇవ్వాల్సి ఉండగా, అందుకు అనుకూలంగా అధికారిక పని చేయడానికి రూ. 14 వేల లంచాన్ని డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది. ఫిర్యాదుదారుడి



నుంచి గ్రామ పాలనాధికారి షేక్ అహ్మద్ ద్వారా లంచం స్వీకరిస్తుండగా నల్గొండ పరిధి ఏసీబీ అధికారులు పట్టుకున్నట్లు పేర్కొంది. అనంతరం షేక్ అహ్మద్ వద్ద నుంచి రూ. 14 వేల లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ వెల్లడించింది. విధులను సక్రమంగా నిర్వహించకుండా అక్రమ ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినట్లు తెలిపింది. ఇద్దరు నిందితులను నాంపల్లి ప్రత్యేక ఏసీబీ న్యాయస్థానంలో హాజరుపరిచి న్యాయ రిమాండ్‌కు తరలించినట్లు ఏసీబీ ప్రకటనలో పేర్కొంది. కేసు దర్యాప్తులో ఉందని, భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలను వెల్లడించలేదని తెలిపింది. ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని అవినీతి నిరోధక శాఖ ప్రజలకు సూచించింది.

# నవ కంటోన్మెంట్ నిర్మాణంలో భాగంగా 'క్లీన్ కంటోన్మెంట్ మిషన్'

**బోర్డు సమావేశంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రతిపాదన**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, సికింద్రాబాద్, ఆగస్టు 24:**
నవ కంటోన్మెంట్ నిర్మాణంలో భాగంగా 'క్లీన్ కంటోన్మెంట్ మిషన్' చేపట్టాలని ఎమ్మెల్యే శ్రీగణేష్ సూచించారు. కంటోన్మెంట్ బోర్డు సాధారణ సమావేశం బోర్డు కార్యాలయంలో బ్రిగేడియర్ రాజీవ్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కంటోన్మెంట్ అభివృద్ధికి పలు సూచనలు చేశారు. నియోజకవర్గంలో పర్యటిస్తూ పలు సమస్యలను గుర్తించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యంగా బోర్డు పరిధిలోని పలు వార్డుల్లో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే 'క్లీన్ కంటోన్మెంట్ మిషన్' ప్రారంభించాలని సూచించారు. ఎమ్మెల్యే సూచనకు బ్రిగేడియర్, సీఈఓ, నామినేటెడ్ సభ్యులు సానుకూలంగా స్పందించి మిషన్‌ను వెంటనే ప్రారంభించేందుకు అంగీకరించారు.

**రూ. 6 కోట్లతో పట్టణ ఆరోగ్య కేంద్రాలు**

నియోజకవర్గంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 6 కోట్లు మంజూరు చేసిందని శ్రీగణేష్ తెలిపారు. రెండు ప్రాంతాలకు ఇప్పటికే నిరభ్యంతర ధ్రువపత్రాలు మంజూరయ్యాయని, మిగిలిన ప్రాంతాలకు కూడా త్వరగా అనుమతులు ఇస్తే నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని అన్నారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం కంటోన్మెంట్ భూములు బదలాయించినందుకు లభించిన రూ. 303 కోట్లతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న భూములకు మరో రూ. 35 కోట్లు అందనున్నాయని తెలిపారు. ఈ నిధులతో నియోజకవర్గంలోని నాలాలు, డ్రైనేజీ వ్యవస్థలను అభివృద్ధి చేసి కంటోన్మెంట్‌ను మరింత అభివృద్ధి చేయాలని బోర్డు సమావేశంలో సూచించారు. సమావేశంలో సీఈఓ అరవింద్ కుమార్ ద్వివేది, నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద, బోర్డు అధికారులు పాల్గొన్నారు.

# ఓటర్లకు నేటి నుంచి నోటీసులు

**ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా 92.87 లక్షల మందికి నోటీసులు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, హైదరాబాద్, ఆగస్టు 24:**
ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా 'అసమానతలు', 'అనుసంధానం కాని' విభాగాల్లో గుర్తించిన ఓటర్లకు సోమవారం నుంచి దశలవారీగా నోటీసులు జారీ చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 92.87 లక్షల మంది ఓటర్లకు నోటీసులు అందనున్నాయి. ఇందులో 60.51 లక్షల మంది అసమానతల విభాగంలో, 32.36 లక్షల మంది అనుసంధానం కాని విభాగంలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు నోటీసులు అందజేయనున్నారు. నోటీసులు అందుకున్న వారు నిర్ణీత గడువులోగా అవసరమైన వివరాలు, పత్రాలతో వివరణ ఇవ్వాలని ఎన్నికల అధికారులు సూచించారు. వివరణ ఇవ్వకపోతే ఓటు తొలగించే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ఓటర్లకు నోటీసులు అందించిన వివరాలను నమోదు చేసేందుకు ప్రత్యేక దరఖాస్తును




ఏర్పాటు చేశారు. నోటీసు అందించిన ఫొటోను అధికారులు అందులో నమోదు చేయాల్సి ఉంటుంది. ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో రోజుకు 200 మంది వరకు వివరణ ఇచ్చేందుకు అవకాశం కల్పించనున్నారు. ప్రభుత్వ గుర్తింపు కార్డుల్లో 11 రకాల కార్డుల్లో ఏదో ఒకదాన్ని చూపిస్తే సరిపోతుందని అధికారులు తెలిపారు. పేరు, ఇంటిపేరు తదితర వివరాల్లో తప్పులు ఉన్న ఓట్లు పెద్ద సంఖ్యలో గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా హైదరాబాద్ పాతనగరం ప్రాంతంలో ఇలాంటి ఓట్లు ఎక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో అధిక సంఖ్యలో నోటీసులు జారీ కానున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అనుసంధానం కాని ఓట్లు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు.

**అర్హులైన ఓట్లను తొలగించం**

నోటీసు అందుకున్నంత మాత్రాన ఓటు తొలగిపోతుందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. నిర్ణీత గడువులో అవసరమైన పత్రాలు సమర్పిస్తే అర్హతను పరిశీలించి ఓటును కొనసాగిస్తామని తెలిపారు. అర్హులైన ఓటర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగించబోమని భరోసా ఇచ్చారు. నోటీసు జాబితాలో తమ పేరు ఉందో లేదో ఓటర్లు ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని అధికారులు సూచించారు.

# పుట్టినరోజున సేవా బాట.. అనాథలకు అండగా నిలిచిన విద్యావేత్త

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 24, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :**
జన్మదినం సందర్భంగా తన సంతోషాన్ని ఇతరులతో పంచుకోవాలనే ఆలోచనతో డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామంలో ఉన్న లిటిల్ మైండ్ పాఠశాల ప్రిన్సిపాల్ గోగుల మల్సూర్ సేవా కార్యక్రమానికి చేయూతనందించారు. విద్యారంగంలో తనదైన ముద్ర వేస్తూ, చిలుకోడు లిటిల్ మైండ్ పాఠశాల ద్వారా ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థాయికి తీర్చిదిద్దుతున్న ఆయన.. సామాజిక సేవలోనూ ఆదర్శంగా నిలుస్తున్నారు. సోమవారం తన జన్మదినాన్ని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లాలోని మాతృదేవోభవ అనాథ ఆశ్రమంలో వికలాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆయన అందించిన సహకారంతో ఆశ్రమ నిర్వాహకులు అక్కడ ఆశ్రయం పొందుతున్న సుమారు నూట యాభై మంది మానసిక వికలాంగులకు అన్నదానం చేశారు. తన పుట్టినరోజును వ్యక్తిగత వేడుకగా జరుపుకోవడం కంటే, ఆదరణ అవసరమైన వారికి ఉపయోగపడేలా చేయాలన్న మల్సూర్ ఆలోచన మానవతా విలువలను చాటిచెప్పింది. ఒక పూట భోజనం కోసం ఎదురుచూస్తున్న వారికి అన్నం అందించడం ద్వారా వారి ఆకలి తీర్చడమే కాకుండా, తన జన్మదినానికి ఓ మంచి జ్ఞాపకాన్ని జోడించారు. విద్యార్థులను చదువులో ముందుకు నడిపించడంతో పాటు సమాజం పట్ల బాధ్యతను గుర్తించేలా ప్రోత్సహించే మల్సూర్.. తాను చెప్పే




విలువలను తన జీవితంలోనూ ఆచరిస్తున్నారు. విద్యతో భవిష్యత్తుకు వెలుగులు పంచుతూ.. సేవతో నిరాధారుల జీవితాల్లో చిరునవ్వులు నింపుతున్న ఆయన జన్మదిన వేడుకలు పలువురికి స్ఫూర్తిగా నిలిచాయి

# ఆలేరు నుండి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నా

**యువతే రేపటి దేశ భవిష్యత్తు**

**జెన్ జీ ప్రశ్నలకు తీన్మార్ మల్లన్న సూటి సమాధానాలు**

**విద్య, వైద్యానికి 40% బడ్జెట్ కేటాయించాలని డిమాండ్**

**అందరికీ ఫ్రీ ఎడ్యుకేషన్ ఇవ్వడం మా పాలసీ**

**ప్రైవేట్ విద్యా దోపిడీపై పోరాటం కొనసాగిస్తా**

**రిజర్వేషన్లు పోవాలంటే ముందుగా కుల వ్యవస్థ పోవాలి**

**సెప్టెంబర్ 17 నుంచి 14 వేల కిలోమీటర్ల పాదయాత్ర**

**టీఆర్పి అధినేత ఎమ్మెల్సీ తీన్మార్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 24, తెలంగాణ బ్యూరో : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా,**
తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇంచార్జి బంధారపు నర్సయ్య గౌడ్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు చక్రపాణి గౌడ్, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ సింగం అరుణ్ పటేల్ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ మైదానంలో నిర్వహించిన "జెన్ జి అడ్డా విత్ మల్లన్న" కార్యక్రమంలో పాల్గొన్న టీఆర్పి పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వేలాది మంది విద్యార్థులు హాజరై తమ సమస్యలు, సందేహాలు, అభిప్రాయాలను ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతో నేరుగా పంచుకున్నారు. విద్య, ఉపాధి, సామాజిక న్యాయం, రాజకీయాలు, రిజర్వేషన్లు, స్కాలర్‌షిప్‌లు వంటి అంశాలపై విద్యార్థులు సంధించిన పదునైన ప్రశ్నలకు మల్లన్న సూటిగా సమాధానాలు ఇచ్చారు.ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ... నేటి రాజకీయ నాయకులు ప్రజల కంటే ఎక్కువగా ప్రశ్నించే యువతను చూసి భయపడుతున్నారని అన్నారు. సోషల్ మీడియా యుగంలో జనరేషన్ జెడ్ దేశ రాజకీయ దిశను మార్చగల శక్తిగా ఎదుగుతోందని పేర్కొన్నారు. యువత ప్రశ్నించే ధైర్యం పెంచుకోవాలని, అన్యాయాలపై గళమెత్తాలని పిలుపునిచ్చారు.విద్యా రంగంపై మాట్లాడుతూ... దేశంలోనే విద్య కోసం అత్యల్పంగా ఖర్చు చేస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, వైద్య రంగాలకు కలిపి బడ్జెట్‌లో కనీసం 40 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మొదటి తరగతి నుంచి ఉన్నత విద్య వరకు ప్రతి విద్యార్థికి పూర్తిగా ఉచిత విద్య అందించడమే తమ లక్ష్యమని ప్రకటించారు.ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీపై తీవ్ర





విమర్శలు గుప్పించిన మల్లన్న, విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న వారిపై నిరంతర పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఆర్.టి.ఈ-2009 చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లు కల్పించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని చెప్పారు.విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా కాంగ్రెస్ పార్టీ నుంచి తన సస్పెన్షన్ వెనుక కారణాలను వివరించారు. రాష్ట్రంలో నిరుద్యోగులు, ఆకలితో బాధపడుతున్న వారి లెక్కలు ఎందుకు లేవని ప్రశ్నించినందుకే తనపై చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు.పాలిటెక్నిక్, ఐటీఐ విద్యార్థుల ఆందోళనలపై స్పందిస్తూ, సరైన మౌలిక వసతులు లేకుండా స్కిల్ ఇండియా యూనివర్సిటీ కింద విద్యాసంస్థలను విలీనం చేయడం సరైంది కాదన్నారు. విద్యార్థుల ఉద్యమాలకు తాము అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.రిజర్వేషన్ల అంశంపై మాట్లాడుతూ, సమాజంలో కుల వివక్ష కొనసాగుతున్నంత కాలం రిజర్వేషన్లు అవసరమేనన్నారు. రిజర్వేషన్లపై చర్చ చేసే వారు ముందుగా కుల వ్యవస్థ నిర్మూలన కోసం పోరాడాలని సూచించారు.రాష్ట్రంలో పేరుకుపోయిన విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించిన మల్లన్న, దాదాపు రూ.9,000 కోట్ల మేర బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ సమస్యపై రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో విద్యార్థుల తరపున గట్టిగా పోరాడతానని హామీ ఇచ్చారు. స్కాలర్‌షిప్‌లు విడుదల కాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రాజకీయంగా కూడా కీలక ప్రకటనలు చేసిన మల్లన్న, 2028 ఎన్నికల్లో ఆలేరు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని ప్రకటించారు. ఉప్పల్ నియోజకవర్గం నుంచి టీఆర్పీ తరపున చక్రపాణి గౌడ్ పోటీ చేస్తారని వెల్లడించారు. అలాగే సెప్టెంబర్ 17 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 14 వేల కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టి రాజ్యాధికారం సాధిస్తాం అని ధీమా వ్యక్తం చేశారు.తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎన్నికల గుర్తు "కత్తెర" అని గుర్తు చేస్తూ, ప్రజల జీవితాలను దోచుకుంటున్న అవినీతి శక్తుల తోకలు కత్తిరించడానికే ఈ గుర్తును ఎంచుకున్నామని పేర్కొన్నారు."విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ నుం ఉద్యమాల వరకు పోరాడతాం... యువత భవిష్యత్తు కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది" అని తీన్మార్ మల్లన్న స్పష్టం చేశారు.కార్యక్రమం అనంతరం వివిధ కళాశాలల విద్యార్థులకు ప్రత్యేక మెరిట్ అవార్డులను తీన్మార్ మల్లన్న చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్పీ నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు, విద్యార్థి నాయకులు, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

# బంగ్లాదేశ్‌కు భారత్ బిగ్ షాక్.. కరెంట్ ఛార్జీలు పెంపు

**బంగ్లాదేశ్‌కు విద్యుత్ సరఫరాపై అదనపు రుసుము**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, న్యూఢిల్లీ, ఆగస్టు 24:**
బంగ్లాదేశ్‌కు భారత్ నుంచి సరఫరా చేస్తున్న విద్యుత్‌పై అదనపు రుసుము విధించే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. సరిహద్దుల మధ్య విద్యుత్ రవాణా, విద్యుత్ గ్రిడ్ నిర్వహణ, మీటరింగ్, లెక్కల నిర్వహణకు అయ్యే ఖర్చుల కోసం ప్రతి యూనిట్‌కు రూ.0.005 రుసుమును వసూలు చేయాలని ప్రతిపాదించినట్లు సమాచారం.ప్రస్తుతం భారత్ నుంచి బంగ్లాదేశ్‌కు వివిధ ఒప్పందాల ద్వారా మొత్తం 2,656 మెగావాట్ల విద్యుత్ సరఫరా అవుతోంది. ఇందులో ఎన్టీపీసీ, దామోదర్ వ్యాలీ కార్పొరేషన్, త్రిపుర విద్యుత్ సంస్థలు, సెమ్‌కార్ప్ సంస్థల ద్వారా విద్యుత్ అందుతోంది. జార్ఖండ్‌లోని అదానీ పవర్ కేంద్రం నుంచి మరో 1,496 మెగావాట్ల విద్యుత్‌ను బంగ్లాదేశ్ కొనుగోలు చేస్తోంది.తొలుత ప్రతి యూనిట్‌కు రూ.0.01 రుసుము విధించాలని ప్రతిపాదించగా, బంగ్లాదేశ్ అభ్యంతరాల నేపథ్యంలో దాన్ని సగానికి తగ్గించి రూ.0.005గా ప్రతిపాదించినట్లు సమాచారం. ప్రతిపాదిత రుసుము సాధారణ విద్యుత్ ధరకు అదనంగా ఉంటుంది.

**నోడల్ సంస్థ ద్వారా చెల్లింపులు**

విద్యుత్ సరఫరాకు సంబంధించిన చెల్లింపులను క్రమబద్ధీకరించేందుకు భారత్‌కు చెందిన ఎన్టీపీసీ విద్యుత్ వ్యాపార్ నిగమ్ లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకునే దిశగా బంగ్లాదేశ్ చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. నోడల్ సంస్థ ద్వారా చెల్లింపులు నిర్వహించడం వల్ల విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు చెల్లింపుల ప్రక్రియ సులభతరం కానుంది.ఇదే




తరహాలో భారత్ నుంచి విద్యుత్ కొనుగోలు చేస్తున్న నేపాల్, భూటాన్ దేశాలు కూడా ప్రతి యూనిట్‌కు రూ.0.005 చొప్పున నోడల్ సంస్థ రుసుము చెల్లిస్తున్నట్లు సమాచార

# రామగుండంలో ఎన్ఐఏ సోదాలు

**సైబర్ నేరాలు, ఉగ్ర సంబంధాల అనుమానంతో ఇంజినీరింగ్ విద్యార్థి విచారణ**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, రామగుండం, ఆగస్టు 24:**
పెద్దపల్లి జిల్లా రామగుండం పరిధిలోని అయోధ్యనగర్‌లో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు సోమవారం తెల్లవారుజామున సోదాలు నిర్వహించినట్లు సమాచారం. సైబర్ నేరాలు, ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించిన అనుమానాల నేపథ్యంలో దంత వైద్యుడు డాక్టర్ అయూబ్ ఖాన్ నివాసంలో ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది.స్థానిక ఎన్టీపీసీ పోలీసుల సహకారంతో ఉదయం సుమారు 5.30 గంటలకు దర్యాప్తు బృందం ఇంటికి చేరుకుని తనిఖీలు నిర్వహించింది. అయూబ్ ఖాన్ కుమారుడు, ఇంజినీరింగ్ విద్యార్థి ముజామిల్‌ను అధికారులు విచారించినట్లు సమాచారం.

**డిజిటల్ పరికరాల స్వాధీనం**

సోదాల్లో విద్యార్థికి చెందిన ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్‌లను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. దేశ భద్రతకు ముప్పు కలిగించే నెట్‌వర్క్‌లు లేదా విదేశీ వ్యక్తులతో సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో డిజిటల్ పరికరాల్లోని సమాచారాన్ని పరిశీలించనున్నట్లు



సమాచారం.అయితే ఈ వ్యవహారంలో విద్యార్థిపై ఎలాంటి నిర్దిష్ట అభియోగాలు నమోదు చేసినట్లు అధికారికంగా వెల్లడించలేదు. సోదాలు, విచారణకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక ప్రకటన వెలువడిన తర్వాతే స్పష్టమయ్యే అవకాశం ఉంది.

# ఏఐతో ప్రేమ.. కొత్త అనుబంధమా? అసలు ప్రమాదం ఇక్కడే!

**ఒంటరితనానికి డిజిటల్ తోడు.. వ్యక్తిగత సమాచార భద్రతపై ఆందోళనలు**

హైదరాబాద్ పల్స్ న్యూస్, మెయిన్ డెస్క్, ఆగస్టు 24: ఒంటరితనం పెరుగుతున్న నేపథ్యంలో కృత్రిమ మేధ ఆధారిత సహచరులతో భావోద్వేగ అనుబంధం పెరుగుతోంది. చాట్‌బాట్‌లతో రోజూ మాట్లాడటం, వ్యక్తిగత విషయాలను పంచుకోవడం, వాటిని స్నేహితుడిగా లేదా జీవిత భాగస్వామిగా భావించే ధోరణి పలు దేశాల్లో కనిపిస్తోంది.మనుషుల మధ్య సంబంధాల్లో ఉండే అపార్థాలు, తిరస్కరణ, బాధ్యతలకు భిన్నంగా ఏఐ సహచరులు ఎప్పుడైనా అందుబాటులో ఉండటం, వినియోగదారుడి అభిరుచికి అనుగుణంగా స్పందించడం వల్ల కొందరికి ఈ అనుబంధం సులభంగా అనిపిస్తోంది. యువతతో పాటు ఒంటరిగా జీవించే వృద్ధులు కూడా ఏఐని భావోద్వేగ సహాయంగా ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది.అయితే ఏఐకి నిజమైన భావోద్వేగాలు ఉండవు. మనిషి చెప్పే విషయాలకు అనుగుణంగా స్పందించేలా రూపొందించిన సాంకేతిక వ్యవస్థ మాత్రమే. అయినప్పటికీ నిరంతరం సంభాషించడం, వ్యక్తిగత సమస్యలను పంచుకోవడం వల్ల ఏఐపై భావోద్వేగ ఆధారపడే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది. ఇది నిజ జీవిత సంబంధాలపై ప్రభావం చూపే ప్రమాదం ఉంది.మరో ప్రధాన ఆందోళన వ్యక్తిగత



సమాచారం భద్రత. భయాలు, కుటుంబ సమస్యలు, అలవాట్లు, వ్యక్తిగత విషయాలను ఏఐతో పంచుకున్నప్పుడు ఆ సమాచారం ఎలా భద్రపరుస్తారు, ఎలా ఉపయోగిస్తారు అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.భవిష్యత్తులో మన స్వరం, ముఖం, జ్ఞాపకాలు, అభిరుచులు, అలవాట్ల ఆధారంగా మరింత వ్యక్తిగతీకరించిన డిజిటల్ సహచరాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఏఐ మనుషుల స్థానాన్ని పూర్తిగా భర్తీ చేస్తుందా అనేది చెప్పడం కష్టమే. కానీ ఒంటరితనానికి ప్రత్యామ్నాయంగా ఏఐ ఆధారిత అనుబంధాలు మాత్రం మరింత విస్తరించే అవకాశముంది.ఏఐని ఉపయోగించడం సమస్య కాదు.. నిజ జీవిత సంబంధాలను పూర్తిగా పక్కనపెట్టి, కృత్రిమ అనుబంధంపైనే ఆధారపడటం మొదలైనప్పుడే అసలు ప్రమాదం.

# హాస్టల్ విద్యార్థి మృతి.. ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

**ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: బీఎస్పీ**



**హైదరాబాద్ పల్స్ న్యూస్,నారాయణఖేడ్, ఆగస్టు 24:**
నారాయణఖేడ్ నియోజకవర్గంలోని జూకల్ శివారులో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే హాస్టల్‌లో ఐదో తరగతి విద్యార్థి మృతి చెందడంపై బీఎస్పీ నారాయణఖేడ్ అధ్యక్షుడు అనుముల తుకారం ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులైన హాస్టల్ ప్రిన్సిపాల్‌తో పాటు సంబంధిత సిబ్బందిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.మృత విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించి న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వ హాస్టళ్లలో అధికారుల పర్యవేక్షణ లోపించడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి విద్యార్థుల భద్రత, వసతులపై సమగ్ర పరిశీలన చేయాలని డిమాండ్ చేశారు.హాస్టళ్లలో విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాల నాయకులను అనుమతించకపోవడం వల్ల పర్యవేక్షణ లోపించి నిర్లక్ష్యం పెరుగుతోందని తుకారం ఆరోపించారు. తమ డిమాండ్లను ప్రభుత్వం, అధికారులు పరిష్కరించకపోతే బీఎస్పీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ నారాయణఖేడ్ ఉపాధ్యక్షుడు కాశయ్య, కార్యదర్శి సాయిలు, నిజాంపేట్ మండల అధ్యక్షుడు యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ కారుల సంఘం తుర్కపల్లి మండలం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ధరావత్ చందర్ నాయక్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 24, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తుర్కపల్లి మండలంలోని మాదాపూర్ గ్రామంలోని కేవల తండాకు చెందిన మలిదశ ఉద్యమకారుడు ధరావత్ చందర్ నాయక్ నియమితులయ్యారు సోమవారం రోజు తుర్కపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కారుల సంఘం అధ్యక్షుడు పూస శ్రీనివాస్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పూస శ్రీనివాస్ మాట్లాడుతూ... తెలంగాణ సాధనలో క్రియాశీలకంగా వ్యవహరించిన ప్రతి ఉద్యమకారునికి, 250 గజాల ఇంటి స్థలం, నెలవారీ రూ. 30,000 పింఛన్ అధికారిక గుర్తింపు కార్డులు అందజేసి ప్రభుత్వం గౌరవించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కారుల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎరుకల వెంకటేష్ గౌడ్, తుర్కపల్లి మండల అధ్యక్షుడు కోట సురేష్, ప్రధాన కార్యదర్శి భూక్యా రమేష్ నాయక్, ఉద్యమ కారుల సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుంటిపల్లి సత్తయ్య, నాయకులు, బండారి శ్రీను, దేవరుప్పల మల్లేష్, ధ్యానబోయిన బొందయ్య, కోట కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్ల రద్దు కోరేవారిపై దేశద్రోహం కేసులు పెట్టాలి: అథవాలే

**రిజర్వేషన్లు రాజ్యాంగం కల్పించిన హక్కు.. వ్యతిరేక ప్రచారాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, న్యూఢిల్లీ, ఆగస్టు 24:**



రిజర్వేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలే డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, వాటిని వ్యతిరేకించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.జంతర్ మంతర్ వద్ద రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలతో పాటు సామాజిక మాధ్యమాల్లో కొనసాగుతున్న ప్రచారాలపై అథవాలే స్పందించారు. రిజర్వేషన్ల రద్దు కోసం ఉద్యమాలు, ప్రచారాలు నిర్వహించే వారిపై దేశద్రోహం కింద కేసులు నమోదు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడంలో రిజర్వేషన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన అన్నారు. రిజర్వేషన్లు సామాజిక న్యాయంతో ముడిపడిన అంశమని పేర్కొన్నారు.అయితే, రిజర్వేషన్లను వ్యతిరేకించడం మాత్రమే దేశద్రోహ నేరంగా పరిగణించబడుతుందా అనేది సంబంధిత చట్టపరమైన నిబంధనలు, వ్యక్తి చేసిన వ్యాఖ్యలు లేదా చర్యల స్వభావంపై ఆధారపడి ఉంటుందని న్యాయపరమైన అంశం స్పష్టం చేస్తోంది.

# బి.పి. మండల్ స్ఫూర్తితో బి.సి జనగణన సాధిద్దాం

## ఆగస్టు 25 న బి.పి మండల్ 108 వ జయంతి

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 24, తెలంగాణ బ్యూరో : ఇండియా జనాభాలో 60 శాతం పైగా ఉండి తరతరాలుగా వారి జనాభా కన్నా ఎక్కువ సేవలు అందిస్తూ సామాజిక అభివృద్ధికి, మానవ మనుగడకు ఎనలేని సేవ చేసిన బి.సి సమాజం లు నేడు అధోగతిలో ఉంది. ఆది మానవుడి నుండి ఆధునిక మానవ సమాజం వరకు ఎన్నో ఆవిష్కరణలు చేయడమే కాక ఇందు గలరు అందు లేరని సందేహం వలదు అన్నట్లు అన్ని రంగాల్లో వారి సేవలు అందించి స్వాభిమానంతో జీవించిన బి.సి లు నేడు ఆందోళనతో జీవిస్తున్నారు. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ, పట్టణీకరణతో వృత్తులు కోల్పోయి రోడ్డున పడ్డారు. వృత్తులను ఆధునీకరించి బి.సి ల అభివృద్ధికి తోడ్పడాల్సిన పాలకులు నిర్లక్ష్యంతో ప్రవర్తిస్తూ కార్పొరేట్ రంగానికి పెద్దపీట వేసి బి.సి లకు తీరని అన్యాయం చేస్తున్నారు. స్వాతంత్రానికి పూర్వం వారి వారి వృత్తులతో ఎంతో అభివృద్ధి పథంలో జీవించి ఆత్మగౌరవంతో బతికిన బి.సి లు స్వాతంత్రాణాంతరం తీవ్ర దోపిడికి గురవుతూ బతకలేక వలసలు పోవడమే కాకుండా బలిదానాలు చేసుకుంటున్నారు.

వెనుకబడిన తరగతుల అభివృద్ధి కోసం దేశంలో ఎందరో మహానీయులు పోరాటాలు చేసి ఎన్నో హక్కులు, రిజర్వేషన్లు కల్పించారు. సర్దార్ సర్వాయి పాపన్న మొదలుకొని నారాయణ గురు, పెరియార్, మహాత్మ జ్యోతిరావు పూలే, ఛత్రపతి శివాజి, భసవేశ్వరుడు, సాహు మహారాజ్, పండగ సాయన్న, కృష్ణ స్వామి, పండిత అయోతి దాస్, అయ్యంకాలి, సర్దార్ గౌతు లచ్చన, చాకలి ఐలమ్మ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, కాన్షిరామ్, కొండా లక్ష్మణ్ బాపూజి, మారోజు వీరన్న లాంటి ప్రముఖులు ఎందరో కృషి చేసారు. స్వాతంత్రాణాంతరం ఎన్నో పోరాటాల ఫలితంగా బి.సి లకు రిజర్వేషన్లు కల్పించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం కోసం బి.సి ల జీవితాలను అధ్యయనం చేయడం కోసం అప్పటి జనతాపార్టీ బి.పి మండల్ (బ్రిందేశ్వర్ ప్రసాద్ మండల్) నేతృత్వంలో కమీషన్ వేశారు. రెండు సంవత్సరాల పాటు దేశమంతా విస్తృతంగా పర్యటించి అన్ని వర్గాల ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకొని బి.పి మండల్ తన నివేదికలో బి.సి ల అభివృద్ధికి 40 సూచనలు చేశారు. ఆ 40 సూచనల్లో ఒక్కటైన విద్య, ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు మాత్రమే అమలులోకి తెచ్చి మిగతా 39 సిపార్సులను గత 40 ఏండ్లుగా బుట్టదాఖలు చేశారు. మండల్ కమీషన్ సిపార్సుల అమలుతో పాటు చట్టసభల్లో రాజ్యాంగ రిజర్వేషన్ల కోసం బి.సి లు దేశ వ్యాప్త ఉద్యమం చేయాల్సిన అవసరముంది.

మండల్ కమీషన్ నివేదికను, ఓ.బి.సి ల రిజర్వేషన్లను దాదాపు అన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకించాయి. ప్రధాన రాజకీయ పార్టీలైన బిజెపి, కాంగ్రెస్ లు బి.సి. ల రిజర్వేషన్లను అడ్డుకునేందుకు ఉద్యమించాయి. ఆయా యూనివర్సిటీల్లో ఆ పార్టీల విద్యార్థి సంఘాలతో, ఆధిపత్య కులాలకు చెందిన విద్యార్థులను ఒబిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఎగదోశారు. ప్రభుత్వ సంస్థలలోని ఆధిపత్య కులాల ఉద్యోగ వర్గం, మీడియా, ఒబిసి రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమానికి అన్ని విధాలుగా సాయం అందించారు. ఒబిసి రిజర్వేషన్ల వ్యతిరేక పోరాటంతో ఆయా రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు, మేధావుల ముసుగులు తొలిగిపోయాయి. ఏకంగా బిజెపి పార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్న జనతాపార్టీ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకొని వి.పి.సింగ్ ప్రభుత్వాన్ని కూల్చారు. ఆనాటి నుండి నేటి వరకు ఒబిసి ల పట్ల బిజెపి వ్యతిరేకంగానే ఉంది. రాష్ట్రాల్లో, కేంద్రంలో అధికారంలోకి రావడం కోసం బి.సి కులాల అసమానతలను వాడుకొని ఒబిసి ఓట్లను కాజేయడం తప్ప బి.సి. లకు ఒరగబెట్టిందేమి లేదు.

భారతదేశంలో విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లకు వంద సంవత్సరాలకు పైనే చరిత్ర ఉంది. స్వాతంత్రానికి పూర్వమే బ్రిటిష్ పాలనలో కొన్ని ప్రాంతాల్లో, కొన్ని స్వదేశీ సంస్థానాల్లో రిజర్వేషన్లు ఉండేవి. భారత రాజ్యాంగానికి మొట్టమొదటి సవరణ రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత కల్పించడం కోసమే చేయబడిందంటే వెనుకబడిన వర్గాల రిజర్వేషన్ల ప్రాముఖ్యత ఎంతో అర్థం చేసుకోవాలి. స్వాతంత్రానికి పూర్వం నుండి కూడా అసమాన సమాజంలో సమానత్వం కోసం తీసుకునే చర్యలలో రిజర్వేషన్లను ఒక చర్యగా భావించడం జరిగింది. రిజర్వేషన్లు రాజ్యాంగంలోని సమానత్వ సూత్రాలకు (ఆర్టికల్ 15ళి16) వ్యతిరేకమని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. సుప్రీంకోర్టు తీర్పు వ్యతిరేకంగా వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లకు మద్దతుగా పెరియార్ చేసిన ఉద్యమంతో 1951 లో పార్లమెంటు లో మొట్టమొదటి రాజ్యాంగ సవరణ చేపట్టి ఆర్టికల్ 15 కు క్లాజు 4 ను చేర్చి ప్రభుత్వం సామాజికంగాను, విద్యా పరంగానూ వెనుకబడిన వర్గాల కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించవచ్చని ఆ క్లాజులో పేర్కొన్నారు. నాటి నుండీ నేటి వరకు రిజర్వేషన్లకు సంబంధించిన అనేక విషయాల గురుంచి వివాదాలు, ఉద్యమాలు, శాసనాలు, న్యాయస్థానాల తీర్పులు కొనసాగుతూనే ఉన్నాయి. మెడికల్ సీట్ల కేటాయింపులో బి.సి లకు అన్యాయం జరుగుతుందని సుప్రీంకోర్టు వరకు వెళ్లిన సంఘటనలు ఉన్నాయి. ఇవన్ని గమనిస్తే మెజార్టీ ప్రజల వెనుకబాటుతనం సమస్య జఠిలతను, ప్రాధాన్యతను తెలియజేస్తున్నాయి. రాజ్యాంగ సవరణ జరిగి 75 ఏండ్లు దాటినా, మండల్ కమీషన్ నివేదిక ఇచ్చి 40 ఏండ్లు దాటినా బి.సి ల స్థితిగతులు మెరుగుపడకపోగా మరింత క్షీణించి పోతున్నాయి. అన్ని రంగాల్లో ప్రత్యేక అవకాశాలు కల్పిస్తేనే వెనుకబడిన వర్గాలు అభివృద్ధి జరుగుతుందని ఎన్నో పోరాటాలు చేసి హక్కులు సాధిస్తుంటే పాలకవర్గాలు వీరి హక్కులను కొల్లగొట్టడానికి ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తున్నారు. దాదాపు మండల్ కమీషన్ అమలు సమయం నుండే ప్రైవేటీకరణను ప్రోత్సహించడం మొదలుపెట్టారు. దాదాపు అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేశారు. విద్యా రంగంలో బహుజనుల అవకాశాలను కొల్లగొట్టడానికి ఏకంగా ప్రైవేట్ యూనివర్సిటీలను తీసుకొచ్చారు. అన్ని రకాల విద్యా సంస్థల్లో ప్రైవేట్ విద్యా సంస్థలు ఎక్కువ ఉండడంతో గత 70 ఏండ్లుగా పోరాడి సాధించుకున్న రిజర్వేషన్లు ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. ప్రైవేటకరణకు వ్యతిరేకంగా బహుజనులు మరో పోరాటం చేయాల్సిన అవసరముంది.

దేశంలో బ్రిటిష్ పాలన కొనసాగుతున్న సమయంలోనే వెనుకబడిన వర్గాలు, అంటరాని కులాలు, ముస్లింలకు జరుగుతున్న అన్యాయాలపై పోరు చేసి జనాభా ప్రాతిపదికన ప్రత్యేక నియోజకవర్గాల ప్రాతినిధ్యం ఇవ్వాలని అన్ని రంగాల్లో అవకాశం కల్పించాలని ఉద్యమాలు చేశారు. ఫలితంగా ముస్లింలు, ఎస్సిలు, క్రిస్టియన్లకు ప్రత్యేక నియోజకవర్గాలు కేటాయించారు. బి.సి లకు మాత్రం ఎలాంటి ప్రత్యేక నియోజకవర్గాలు కేటాయించలేదు. స్వాతంత్ర ఉద్యమ సమయం, రాజ్యాంగ రచన సమయంలో బి.సి. ల హక్కుల గూర్చి, విద్యా ఉద్యోగ రంగాల్లో బి.సి ల రిజర్వేషన్ గూర్చి, రాజకీయ రిజర్వేషన్ల గూర్చి పోరాటం చేసినా అప్పటి కాంగ్రెస్ నాయకులు ఆ పోరాటాలను నీరుగార్చారు. స్వాతంత్రం సిద్ధించిన అనంతరం బి.సి ల హక్కుల పోరాటం వల్ల బి.సి ల సామాజిక ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేయడం కోసం 1953 జనవరిలో కాకా కలేల్కర్ కమిషన్ ను ప్రభుత్వం నియమించింది. 1955 మార్చిలో కమిషన్ నివేదిక సమర్పించి బి.సి ల అభివృద్ధికి పలు సూచనలు చేసింది. దేశంలో 2399 కులాలు వెనుకబడిన తరగతులుగా ఉన్నాయని అందులో 837 కులాలు బాగా వెనుకబడిన కులాలుగా ఉన్నాయని



నివేదికలో తెలిపింది. భూ సంస్కరణలు జరిపించాలని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పునవ్యవస్థీకరించాలని, వయోజన విద్య, విశ్వవిద్యాలయాల చదువులు మొదలగు అనేక రంగాల్లో వెనుకబడిన తరగతుల కోసం సత్వరాభివృద్ధి చేపట్టాలని సూచనలు చేశారు. 1961 లో కులాల వారీగా జనాభా లెక్కలు తీయాలని, కమీషన్ సమర్పించిన నివేదికను ప్రభుత్వం బుట్టదాకలు చేసింది. మండల్ కమీషన్ నివేదిక కూడా బి.సి జనగణన చేయాలని స్పష్టంగా తెలిపింది. మండల్ కమీషన్ అమలుపై కోర్టులో కేసు నడిచిన సందర్భంలో కూడా 1931 తర్వాత బి.సి జనాభా లెక్కలు తీయలేదని, జనాభా లెక్కలు లేకుండా ఏ ప్రాతిపదికన బి.సి లకు రిజర్వేషన్లు అమలు చేస్తారని సుప్రీమ్ కోర్టు ప్రశ్నించింది. కమీషన్లు చెప్పినా, కోర్టు ప్రశ్నించినా కూడా ఈ దేశంలో పాలన కొనసాగించిన కాంగ్రెస్, పాలన కొనసాగిస్తున్న బిజెపి బి.సి జనగణన చేయడం లేదు. ఆదిపత్య దోపిడి కులాలకు చెందిన పార్టీలు దేశాన్ని పాలిస్తుండడం వల్లనే బి.సి జనగణతో పాటు, బి.సి లకు చట్టసభల్లో వాటా దక్కడం లేదు. 80 ఏండ్ల వాస్తవాన్ని అధ్యయనం చేసిన తర్వాతనైనా బి.పి. మండల్ స్ఫూర్తితో బి.సి లు స్వతంత్ర రాజకీయ శక్తిగా ఎదిగి రాజ్యాధికారంలోకి వస్తేనే అన్ని సమస్యలకు పరిష్కారం జరుగుతుంది.

1977 లో జనతా పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో తాము అధికారంలోకి వస్తే కాకా కలేల్కర్ కమీషన్ నివేదిక అమలు చేసి బీ.సి లకు న్యాయం చేస్తామని తెలిపింది. అధికారంలోకి వచ్చిన జనతా పార్టీ కమీషన్ నివేదికను అమలుపరచక పోవడంతో బి.సి సంఘాల, నాయకులు ఒత్తిడి చేయడంతో అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయి ప్రభుత్వం మరోలా స్పందించి కాక కలేల్కర్ కమీషన్ నివేదిక సమర్పించి చాలా ఏండ్లు అయిందని కొత్త కమిషన్ ను నియమిస్తామని చెప్పింది. బీహార్ మాజీ ముఖ్యమంత్రి బి.పి మండల్ ఆధ్వర్యంలో 1978 డిసెంబర్ లో రెండవ బి.సి కమీషన్ నియమించింది. బి.పి. మండల్ 1980 డిసెంబర్ 31 న నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. మళ్ళీ పాత కథే నివేదిక అమలులో జాప్యం దాంతో బి.సి నాయకులంతా ఏకమై 1981 సెప్టెంబర్ లో నేషనల్ యూనియన్ ఆఫ్ బ్యాక్ వార్డ్ క్లాసెస్ అనే ఒక ఉద్యమ సంస్థను ఏర్పాటు చేశారు. బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ ఆ సంస్థను ప్రారంభించగా చౌదరి బ్రహ్మప్రకాష్ అధ్యక్షులుగా ఉండి ఉద్యమం చేశారు. 110 మంది పార్లమెంటు సభ్యులు సంతకాలతో కూడిన మెమోరాండం ప్రభుత్వానికి సమర్పించారు. ఐదు లక్షల ప్రజల సంతకాలతో కూడిన మెమోరాండం రాష్టపతి జ్ఞాని జైల్ సింగ్ కు ఇచ్చారు. 1988 నుండి 1990 వరకు బహుజన సమాజ్ పార్టీ మండల్ నివేదిక అమలుకు పోరాటం చేసింది. బి.పి. మండల్ కమీషన్ అమలు కోసం ఢిల్లీ లోని బోట్స్ క్లబ్ వద్ద కాన్షీరాం 48 రోజుల ధర్నా చేసాడు. ఉద్యమాల ఒత్తిడి, మ్యానిఫెస్టోలో ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం అప్పటి ప్రధాని వి.పి సింగ్ 1990 ఆగస్టు 7 న మండల్ నివేదిక అమలుపరుస్తానని ప్రకటన చేసాడు. ప్రధాని ప్రకటనతో దేశ వ్యాప్తంగా ఆధిపత్య కులాల ఆందోళన చేయడమే కాకుండా అన్ని పార్టీలు మండల్ నివేదికకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేశాయి. నిరసనగా బయట నుండి వి.పి ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న బీజేపీ మద్దతు ఉపసంహరించడమే కాకుండా ప్రజలను తప్పుదోవ పట్టివ్వడం కోసం ఆనాడు బీజేపీ అద్వానీ నాయకత్వంలో అయోధ్య రద యాత్ర చేపట్టింది. ఆనాడు రామమందిర్ రథ యాత్ర చేసిన బిజెపి నేడు రామమందిర నిర్మాణంలో బి.సి లను బాగస్థులను చేసి మతంలో మునిగి బి.సి ల హక్కులను గాలికొదిలే విధంగా చేస్తున్న బిజెపి కుటిల రాజకీయాలను ఒబిసి లు గమనించాలి.

మండల్ కమీషన్ ను అమలు చేయరాదని ఆధిపత్య కులాల వారు కోర్టును ఆశ్రయించారు. చివరకు 1993 లో మండల్ నివేదిక అమలుకు కోర్టు అనుమతి ఇవ్వడంతో బి.సి లకు కేంద్ర సర్వీసుల్లో, ఐఎఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఐటి, ఎన్ఐటి, ఐఐఎం, కేంద్రీయ విశ్వ విద్యాలయాల్లో 52 శాతం జనాభా ఉన్న బి.సీ లకు 27 శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. మొత్తం మండల్ కమీషన్ బి.సి ల అభివృద్ధికి 40 సూచనలు చేయగా అందులో ఒకటైన విద్యా ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్ కల్పించి అప్పటి ప్రభుత్వం చేతులు దులుపుకుంది.

పారిశ్రామికీకరణ, ప్రైవేటీకరణ వల్ల స్థానిక వర్గాల వృత్తులు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయని వారికి ప్రత్యామ్నాయం చూడాలని, భూ సంస్కరణలు చేపట్టాలని, ఓబీసీ లకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, అన్ని రకాల ఆర్థిక వనరులను రాష్టాలకు కేంద్రమే సమకూర్చాలని, ప్రైవేట్ సంస్థల్లోనూ ఉద్యోగాల్లో ఓబీసీ లకు 27 శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఒబిసి లు ఉన్న ప్రాంతంలో వయోజన విద్యతో పాటు రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభించి విద్యార్థుల డ్రాపవుట్ తగ్గించి మెరుగైన విద్య అందించాలని, ఉన్నత విద్యలో చేరే వాళ్లకు ప్రత్యేక కోచింగ్ లు ఇవ్వాలని, కుల వృత్తిదారులకు ఆర్థిక సహాయం, సాంకేతిక సహాయం అందించి చిన్నతరహా పరిశ్రమలు స్థాపించుకోవడానికి ప్రోత్సకాలు, వృత్తి కులాలకు సహకార సంఘాలు, ఉత్పత్తి రంగంలో మౌలిక మార్పులు, ఓబీసీ లకు మిగులు భూమి పంపిణీ లాంటి సూచనలు నివేదికలో పొందుపరిచారు. బి.సి డెవలప్మెంట్ కార్పోరేషన్ ఏర్పాటు చేసి సామాజిక, విద్యా, ఆర్థిక అబివృద్ధికి కృషి చేయాలని ఓబీసీల్లో అత్యంత వెనుకబడిన సమూహాలకు సముచిత స్థానం కల్పించేందుకు వారు అత్యధికంగా నివసించే ప్రాంతాలను డీ లిమిటేషన్ సమయంలో నియోజకవర్గాలుగా మార్చాలని కూడా సూచించారు.

### నీతి నిజాయితీకి మారు పేరు బి.పి మండల్

ఆగస్టు 25, 1918 లో బీహార్ రాష్ట్రం మధేపూర్ జిల్లా మోరో గ్రామంలో రాస్ బీహారీ లాల్ మండల్ జమీందారి కుటుంబంలో జన్మించిన బి.పి మండల్ 23 ఏటనే జిల్లా కౌన్సిల్ కు ఎన్నికయ్యారు. జీతం తీసుకోకుండా జుడిషియల్ మేజిస్టేట్ గా పనిచేశారు. 1952 మొదటిసారిగా శాసనసభకు ఎన్నికైన మండల్ ఆరోగ్య శాఖ మంత్రిగా, ఎం.పి గా పనిచేశారు. రామ్ మనోహర్ లోహియా నాయకత్వంలో పనిచేసిన మండల్ 1967 లో బీహార్ లో జరిగిన ఎన్నికల్లో 69 మంది ఎమ్మెల్యేలను గెలిపించి ఫిబ్రవరి 1968 లో బీహార్ ముఖ్యమంత్రిగా పదవి చేపట్టారు. బయట నుండి మద్దతునిచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకుల అవినీతిపై విచారణ జరిగితే ఆ విచారణ బుట్టదాకలు చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల్ పై ఒత్తిడి చేసింది. అయినా నిజాయితీగా కాంగ్రెస్ అవినీతి నాయకులపై చర్య తీసుకున్నారు. దాంతో కాంగ్రెస్ మద్దతు ఉపసంహరించుకోవడంతో ప్రభుత్వం కూలిపోయింది తన ప్రభుత్వం కూలిపోతుందని తెలిసిన నీతికోసం నిలబడిన నాయకుడు బి.పి. మండల్ 1974 లో ఎమ్మేల్యే పదవికి రాజీనామా చేసి లోక్ నాయక్ జయప్రకాష్ నారాయణ నాయకత్వంలో అవినీతి వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని 1977 లో జనతాపార్టీ తరుపున లోకసభకు ఎన్నికయ్యారు.

కమిషన్ నివేదిక సమర్పించిన 10 ఏండ్ల తర్వాత కమీషన్ సూచించిన 40 సూచనల్లో ఒక్క విద్య ఉద్యోగాల్లో మాత్రమే రిజర్వేషన్ కల్పించింది. అది కూడా 50 శాతం పైనున్న బి.ల లకు 27 శాతం రిజర్వేషన్ కల్పించింది. అలా కల్పించిన రిజర్వేషన్ పలాలను ఇప్పిడిప్పుడే అందుకుంటున్న బి.సి లకు క్రిమిలేయర్ తో ఉన్నత విద్యా సంస్థల్లో ఒబిసి ల కోటాలో మిగిలిన సీట్లను కూడ ఆధిపత్య కులాల వారు కొట్టేస్తున్నారు. అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు ఇస్తే అడ్డురాని చట్టం బి.సి లకు 52 శాతం రిజర్వేషన్ ఇస్తే ఏమవుద్దని బి.సి లు పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన అవసరముంది. 52 శాతం జనాభా కలిగిన బి.సి లకు సకల సామాజిక రంగాల్లో 52 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిన బాధ్యత మరచిన ఆధిపత్య ప్రభుత్వాలు ఎన్నో పోరాటాల పలితంగా వచ్చిన 27 శాతం రిజర్వేషన్లను కాలరాయడానికి ప్రైవేటీకరణను ప్రోత్సహించడం సిగ్గుచేటు. 27 శాతం రిజర్వేషన్లను కాపాడుకోవడానికి, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడానికి, మండల్ సూచించిన ఇతర సూచనలను సాధించుకోవడానికి, చట్టసభల్లో బి.సి ల రిజర్వేషన్ల కోసం, ఒబిసి జనగణన కోసం బి.పి. మండల్ ఆదర్శంగా బి.సి లు ఉద్యమించాల్సిన అవసరముంది. బహుజన రాజ్యాధికారం కోసం ఉద్యమిస్తున్న సమాజ్ వాద్ పార్టీ, బహుజన సమాజ్ పార్టీ లాంటి వారు బి.సి ల హక్కులకు మద్దతుగా పోరాటం చేయాల్సిన బాధ్యత ఉంది. బి.సి కులాలు, సంఘాలు రాజకీయాలకు అతీతంగా ఒక్కటై మండల్ స్ఫూర్తిగా మండల్ నివేదికను అమలుకోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడమే పరిష్కారం.

### కాంగ్రెస్, బిజెపి రెండు బి.సి వ్యతిరేక పార్టీలే

అన్ని పార్టీలకన్నా ఎక్కువ కాలం దేశాన్ని పాలించిన కాంగ్రెస్, గత 12 ఏండ్లుగా పాలిస్తున్న బిజెపి బి.సి లకు వ్యతిరేక పార్టీలే. కాంగ్రెస్ అధికారంలో ఉన్నపుడు బి.సి జనగణన చేయనప్పుడు ప్రతిపక్షంలో ఉన్న బిజెపి తాము అధికారంలోకి వస్తే ఒబిసి జనగణన చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒబిసి జనగణన సాధ్యం కాదని నిస్సిగ్గుగా చెప్పి దేశంలోని 80 కోట్ల ఒబిసి లకు మోసం చేసింది. పూర్వ కాంగ్రెస్ పాలకులు ఒబిసి ల సమస్యలను సరిగా అర్థం చేసుకోకుండా ఒబిసి లకు అన్యాయం చేసిందని, ఇకముందు ఒబిసి లకు న్యాయం చేస్తామని, కుల జనగణన సామాజికన్యాయానికి ఎక్స్ రే లాంటిదని కాంగ్రెస్ అధికారంలోకి వస్తె కుల జనగణన జరిపి రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తామని రాహుల్ గాంధీ ప్రకటించారు. తెలంగాణ ఎన్నికల ముందు పెద్ద బహిరంగ సభ పెట్టి స్థానిక సంస్థల్లో బి.సి లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించి మూడు ఏండ్లు కావస్తున్నా దిక్కు లేని స్థితి. 42 శాతం రిజర్వేషన్లకు ఉన్న రాజ్యాంగపర అడ్డంకులను తొలగించడంలో కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం శూన్యం. బి.సి ల అభ్యున్నతి కోసం కాకా కలేల్కర్ కమీషన్ మొదలుకుని మండల్ కమీషన్ నివేదిక వరకు జరిగిన అన్ని పోరాటాల్లో బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర బహుజన నాయకులు కీలకపాత్ర వహించారు. మండల్ కమీషన్ నివేదిక సమర్పణ అనంతరం దేశంలో జరిగిన రాజకీయ పరిణామాల వల్ల బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నాయకులు బహుజన ఉద్యమాల్లో వెనుకబడ్డారు. ప్రస్తుతం పెరియార్ వారసులైన తమిళనాడు బహుజన నాయకులతో పాటు తెలుగు రాష్ట్రాల బి.సి నాయకులు కీలకపాత్ర వహిస్తున్నారు. బి.సి ల సమస్యల సాధన కోసం, బి.సి జనగణన కోసం, బి.సి లకు విద్య, ఉద్యోగ, చట్టసభల్లో బి.సి లకు రిజర్వేషన్ల కోసం పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. రాజ్యాధికారం ద్వారానే బి.సి లకు విముక్తి జరుగుతుందనే వాదన పెరుగుతుంది. ఈ క్రమంలో కులాలుగా విడగొట్టబడిన బి.సి లు ఏకమై పార్టీలకు, సంఘాలకు అతీతంగా ఐక్యమై బి.పి మండల్ ఆదర్శంగా ముందుకు సాగాలి.

సాయిని నరేందర్,
న్యాయవాది
సామాజిక, రాజకీయ విశ్లేషకులు :
9701916091



# మిస్ యూనివర్స్ వేదికను సుస్మితా సేన్ తో పంచుకోవడంపై ఊర్వశి రౌతేలా ఎమోషనల్

నటి, మాజీ అందాల రాణి ఊర్వశి రౌతేలా మరోసారి వార్తల్లో నిలిచారు. మిస్ యూనివర్స్ ఇండియా పోటీలకు ఆమె వరుసగా నాలుగోసారి న్యాయనిర్ణేతగా వ్యవహరించి ప్రత్యేకతను చాటుకున్నారు. అయితే, ఈసారి ఈ కార్యక్రమం ఆమెకు వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకం అయింది. తన కెరీర్ ఎదుగుదలలో కీలక పాత్ర పోషించిన, తన గురువుగా భావించే సుస్మితా సేన్‌తో వేదిక పంచుకోవడంతో ఊర్వశి భావోద్వేగానికి గురయ్యారు.ఈ సందర్భంగా తన గురువు సుస్మితా సేన్‌తో ఉన్న అనుబంధాన్ని ఊర్వశి పంచుకున్నారు. “నా మొదటి మెంటర్, నా గురువు, మన దేశపు తొలి మిస్ యూనివర్స్ సుస్మితా సేన్‌తో ఈ క్షణాలను పంచుకోవడం అనంతమైన ఆనందాన్ని ఇస్తోంది. నాకు ఎగరడానికి రెక్కలిచ్చిన మహిళ ఆమె. సాధారణంగా ఆమె ఎవరికీ అలా చేయరు, కానీ నా పట్టాభిషేకం రోజున స్వయంగా ఆమే నాకు కిరీటాన్ని అలంకరించారు. అది నా జీవితంలో అత్యంత మధురమైన, మరచిపోలేని క్షణాల్లో ఒకటి” అంటూ ఊర్వశి తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.సుస్మితా సేన్ తనపై ఉంచిన నమ్మకాన్ని ఎప్పటికీ మర్చిపోలేనని ఊర్వశి తెలిపారు. “ఆమె నాపై ఎందుకు అంత నమ్మకం ఉంచిందో ఇప్పటికీ ఆశ్చర్యంగా ఉంటుంది. కానీ కొన్ని ఆశీర్వాదాలకు వివరణలు ఉండవేమో, వాటిని ఆస్వాదించాలి అంతే. దేవుడికి, నా తల్లిదండ్రులకు, కుటుంబానికి, అభిమానులకు, ముఖ్యంగా నా గురువు సుస్మితకు నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను. నా కృతజ్ఞతను మాటల్లో చెప్పలేను. కొన్ని కలలు నెరవేరతాయి, మరికొన్ని ఊహకు మించి ఉంటాయి. ఇది రెండో కోవకు చెందింది” అని ఆమె ఉద్వేగంగా మాట్లాడారు.ఇక ఈ కార్యక్రమంలో ఊర్వశి ధరించిన త్రివర్ణ పతాకం గౌను ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీని గురించి ఆమె మాట్లాడుతూ, “వరుసగా నాలుగోసారి మిస్ యూనివర్స్ ఇండియాకు జడ్జిగా వ్యవహరించడం ద్వారా ప్రపంచ రికార్డు సృష్టించినట్లు మా టీమ్ చెప్పింది. ఇది నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ‘నేను ఇండియన్’ అని చెప్పాను. ఇప్పుడు ఈ త్రివర్ణ పతాక గౌనులో మిస్ యూనివర్స్ ఇండియాకు జడ్జిగా వ్యవహరిస్తుంటే, ఆ మాటలకు మరింత అర్థం చేకూరినట్లు అనిపిస్తోంది. భారతీయురాలిగా పుట్టినందుకు గర్వపడుతున్నాను” అని ఊర్వశి తన దేశభక్తిని చాటుకున్నారు.





# మహిళల ఏపీఎల్‌కు వేళాయె..

ఆంధ్రప్రదేశ్‌లో మహిళల క్రికెట్‌ను ప్రోత్సహించే లక్ష్యంతో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ 2026కు సర్వం సిద్ధమైంది. ఈ లీగ్‌లో తొలి అడుగుగా క్రీడాకారిణుల వేలం ప్రక్రియ ఆగస్టు 25, మంగళవారం విజయవాడలో జరగనుంది. రాష్ట్రంలో పూర్తిస్థాయి ఫ్రాంచైజీ ఫార్మాట్‌లో మహిళల టీ20 లీగ్ నిర్వహించడం ఇదే తొలిసారి కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ వేలంలో మొత్తం 191 మంది క్రీడాకారిణులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. అమరావతి ఇ-ఛాంపియన్స్, రాయలసీమ జెన్ స్టార్స్, వైజాగ్ ఫైర్ బర్డ్స్, గోదావరి గోల్డెన్ ఈగల్స్ పేరుతో నాలుగు ఫ్రాంచైజీలు ఈ వేలంలో పాల్గొననున్నాయి. ప్రతి ఫ్రాంచైజీ గరిష్ఠంగా రూ. 15 లక్షల పర్స్‌తో బరిలోకి దిగనుండగా, కనీసం రూ. 13.5 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఒక్కో జట్టులో 18 నుంచి 20 మంది క్రీడాకారిణులను ఎంపిక చేసుకోవాలి.వేలం కోసం క్రీడాకారిణులను రెండు గ్రేడ్‌లుగా విభజించారు. భారత జట్టుకు, డబ్ల్యూపీఎల్‌కు ప్రాతినిధ్యం వహించిన వారితో పాటు సీనియర్, అండర్-23 రాష్ట్ర స్థాయి క్రీడాకారిణులను గ్రేడ్-ఏలో చేర్చారు. వీరి కనీస ధర రూ. 50,000గా నిర్ణయించారు. ఇక జిల్లా, జోనల్ స్థాయిలో ఆడిన క్రీడాకారిణులను గ్రేడ్-



బిలో ఉంచి, వారి కనీస ధరను రూ. 30,000గా ఖరారు చేశారు.ఇటీవల జరిగిన ఫ్రాంచైజీల బిడ్డింగ్‌లో ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ అత్యధికంగా రూ. 89 లక్షలకు అమరావతి ఇ-ఛాంపియన్స్ జట్టును దక్కించుకుంది. భారత మహిళల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్‌ను ఈ టోర్నీకి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రముఖ ఆక్షనీర్ శ్వేతా బాల్ ఈ వేలాన్ని నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 15 నుంచి 26 వరకు జరగనున్న ఈ టోర్నమెంట్‌లోని మ్యాచ్‌లన్నీ మంగళగిరిలోని ఏసీఏ స్టేడియం వేదికగా జరగనున్నాయి.

# హాకీ ప్రపంచ కప్: సెమీస్ రేసు నుంచి భారత్ ఔట్

ఇంటర్నెట్ డెస్క్: 2026 పురుషుల హాకీ వరల్డ్ కప్‌లో భారత్‌కు షాక్ తగిలింది. సోమవారం పూల్-ఈ చివరి మ్యాచ్‌లో అర్జెంటీనా చేతిలో భారత్ 3-5 తేడాతో ఓటమి పాలైంది. దీంతో టీమిండియా సెమీస్ రేసు నుంచి నిష్క్రమించింది. పూల్-ఈలో భారత్ చివరి స్థానంతో సరిపెట్టుకుంది. మ్యాచ్ ఆరంభమైన 39 సెకన్లకే అర్జెంటీనాకు జోక్విన్ టొస్కానీ గోల్ అందించాడు. కొద్దిసేపటికే నికోలస్ డి లా టొర్రే మరో గోల్ చేసి అర్జెంటీనా ఆధిక్యాన్ని 2-0కి పెంచాడు. అయితే భారత్ వెంటనే పుంజుకుంది. సుఖ్‌జీత్ సింగ్ గోల్ చేయడంతో ఆధిక్యం 2-1కి తగ్గింది. దీంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది.మూడో క్వార్టర్‌లో అర్జెంటీనా మరోసారి భారత్‌పై ఒత్తిడి పెంచింది. టొమాస్ డొమెనే వరుసగా రెండు గోల్స్ చేసి అర్జెంటీనా ఆధిక్యాన్ని 4-1కి చేర్చాడు. నాలుగో క్వార్టర్‌లో లూకాస్ టొస్కానీ మరో గోల్ చేయడంతో అర్జెంటీనా 5-1తో నిలిచింది. మ్యాచ్ చివరి రెండు నిమిషాల్లో భారత్ అద్భుతంగా పోరాడింది. సుఖ్‌జీత్ సింగ్ మరో గోల్ చేయగా, హార్దిక్ సింగ్ కూడా గోల్ సాధించాడు. దీంతో స్కోరు 5-3కి చేరింది. అయితే అప్పటికే సమయం




పూర్తవడంతో భారత్ ఓటమి తప్పలేదు. చివరి క్షణాల్లో చేసిన ఈ రెండు గోల్స్ కేవలం ఓదార్పుగానే మిగిలాయి.

**సెమీస్ ఆశలు గల్లంతు..**

పూల్-ఈలో అర్జెంటీనాతో ఓటమితో భారత్ సెమీఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది. టోర్నీలో కొత్త ఫార్మాట్ ప్రకారం పూల్-జులో అగ్రస్థానంలో నిలిచే రెండు జట్లు మాత్రమే సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఇక భారత్ ఏడో స్థానం కోసం జరిగే మ్యాచ్‌లో సహ ఆతిథ్య దేశం బెల్జియంతో తలపడనుంది. శుక్రవారం ఈ మ్యాచ్ జరగనుంది. సెమీఫైనల్ లక్ష్యంతో బరిలోకి దిగిన హర్మన్‌ప్రీత్ సింగ్ సేనకు అర్జెంటీనా ఇచ్చిన షాక్‌తో ప్రపంచకప్ పతక ఆశలు దూరమయ్యాయి.

## SPORTS

# శ్రీలంక ప్లేయర్‌తో గొడవ.. యశస్వి జైస్వాల్‌పై ఐసీసీ చర్యలు




భారత బ్యాటర్ యశస్వి జైస్వాల్, శ్రీలంక పేసర్ అసిత ఫెర్నాండో మధ్య మైదానంలో చోటు చేసుకున్న వాగ్వాదంపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చర్యలు తీసుకుంది. కొలంబో వేదికగా జరుగుతున్న రెండో టెస్టు తొలి రోజు జరిగిన ఘటనకు సంబంధించి ఇద్దరు ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించింది. అంతేకాకుండా ఇద్దరి ఖాతాల్లోనూ ఒక్కో డీమెరిట్ పాయింట్ జత చేసింది. ఇద్దరూ ఐసీసీ ప్లేయర్స్ అండ్ ప్లేయర్ సపోర్ట్ పర్సనల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లోని ఆర్టికల్ 2.12ను ఉల్లంఘించినట్లు ఐసీసీ వెల్లడించింది.

**అసలేం జరిగిందంటే?**

భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 17వ ఓవర్‌లో అసిత ఫెర్నాండో బౌలింగ్‌లో జైస్వాల్ ఔటయ్యాడు. అనంతరం జైస్వాల్ పెవిలియన్‌కు వెళ్తుండగా.. ఫెర్నాండో ఏవో వ్యాఖ్యలు చేశాడు. దీంతో ఒక్కసారిగా ఆగ్రహానికి గురైన యశస్వి.. ఫెర్నాండోతో వాగ్వాదానికి దిగాడు. ఇద్దరి మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఈ క్రమంలో జైస్వాల్ హెల్మెట్ ఫెర్నాండో తలకు తగిలింది. పరిస్థితి చేయిదాటిపోయేలా ఉండటంతో లంక కెప్టెన్ ధనంజయ డిసెల్వా, వైస్ కెప్టెన్ కమిందు మెండిస్‌తో పాటు ఇతర ప్లేయర్లు, అంపైర్లు జోక్యం చేసుకుని ఇద్దరినీ దూరంగా తీసుకెళ్లారు. దీంతో గొడవ సద్దుమణిగింది. కాగా ఇద్దరూ తమ తప్పును అంగీకరించడంతో ఎలాంటి విచారణ లేకుండా ఐసీసీ శిక్ష ఖరారు చేసింది. అయితే ఈ ఇద్దరి పైగా సంవత్సరం కాలంగా ఎలాంటి పనిష్‌మెంట్లు లేకపోవడం గమనార్హం.